E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: TELANGANA    సంపుటి :01    సంచిక :148    బుధవారం 06 మే 2026    ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్    పేజీలు: 08    వెల :05/-

## నాబార్డు క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరించిన
# ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, మే 5: నాబార్డు క్రెడిట్ ప్లాన్ స్టేట్ ఫోకస్ పేపర్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. 2026–27 సంవత్సరానికి గాను రూ.5.11 లక్షల కోట్ల రుణ ప్రణాళికతో నాబార్డు అంచనాలు రూపొందించింది. రుణ ప్రణాళిక గత ఏడాది రూ.4.24 లక్షల కోట్లు ఉండగా... ఈ ఏడాది 20 శాతం పెంచి రూ.5,11,491 కోట్లతో ప్రాధమిక రంగానికి రుణ ప్రణాళిక ప్రకటించింది. సాగుకు మొత్తం రూ.2.55 లక్షల కోట్లు కేటాయించింది. ఇందులో పంట రుణాలు రూ.1.66 లక్షల కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.34,972 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు రూ.8,265 కోట్లు, ఫిషరీస్‌కు రూ.21,098 కోట్లు, హార్టికల్చర్‌కు రూ.11,961 కోట్లు కేటాయించింది.

మిగతా 2లో..

# రైతుల గోడు పట్టదా..??




5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో బీజేపీ సాధించిన విజయంతోపాటు ఈనెల 10న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరగబోయే ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభపై జరుగుతున్న చర్చను దారి మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీబీఐ విచారణ పేరుతో డ్రామాలాడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. రాష్ట్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాల్లో మండుటెండలో రైతులు అరిగోస పడుతున్నా, వడదెబ్బకు తాళలేక చచ్చిపోతున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. తాలు, తరుగు పేరుతో పెద్ద ఎత్తున కటింగ్ చేస్తూ రైతులను దోచుకుంటున్నా, వడ్ల కొనుగోలు కోసం టోకెన్లు ఇవ్వడానికి కూడా దళారులు కమీషన్లు దండుకుంటుంటే ఈ ప్రభుత్వం ఏం చేస్తోందని దుయ్యబట్టారు.

## తమిళనాడు సీఎంగా
# విజయ్..!!



- టీవీకే శాసనసభాపక్షం చీఫ్ గా విజయ్ ఎన్నిక
- బుధవారం గవర్నర్ ను విజయ్ బృందం కలిసే అవకాశం
- సీఎం గా ప్రమాణ స్వీకారంకు మార్గం సుగమం

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాలను సమూలంగా మార్చివేశాయి. దశాబ్దాలుగా పాతుకుపోయిన ద్రవిడ పార్టీల ఆధిపత్యాన్ని ఛేదిస్తూ, హీరో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కజగం అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఈ విజయంతో తమిళనాడులో సరికొత్త రాజకీయ శకం ప్రారంభమైంది.

టీవీకే పార్టీ అత్యధిక సీట్లు గెలుచుకున్న తరుణంలో, ఆ పార్టీ శాసనసభాపక్ష నాయకుడిగా పార్టీ అధినేత, హీరో విజయ్‌ను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలంతా సమావేశమై విజయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల పార్టీ శ్రేణుల్లో సంబరాలు అంబరాన్ని తాకాయి.

ఈ పరిణామాల నేపథ్యంలో, ప్రభుత్వ ఏర్పాటుకు అడుగు దూరంలో ఉన్న టీవీకే పార్టీ బుధవారం నాడు గవర్నర్ అపాయింట్మెంట్ కోరింది. గవర్నర్ ని కలవడానికి విజయ్ సిద్ధమవుతున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా ఆయన గవర్నర్‌ను కోరే అవకాశం ఉంది.

టీవీకే పార్టీ 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా నిలిచినా, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సాధారణ మెజారిటీకి మరికొన్ని స్థానాల మద్దతు అవసరం ఉంది. దీంతో ఇతర చిన్న పార్టీలతో టీవీకే నాయకులు సంప్రదింపులు జరుపుతున్నారు.

అన్ని అనుకూలిస్తే, గురువారం నాడు ముఖ్యమంత్రిగా విజయ్ పదవీ స్వీకార ప్రమాణం చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. మే 7వ తేదీన ప్రమాణస్వీకారానికి ముహూర్తం ఖరారయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి.

ఒకప్పటి దివంగత ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్ తరహాలోనే, విజయ్ తనకున్న సినీ ఇమేజ్‌ను రాజకీయాల్లోకి విజయవంతంగా మార్చుకున్నారు. ఒంటరిగా పోటీ చేసి సాధించిన ఈ విజయం, జాతీయ స్థాయిలోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఈ ఎన్నికల్లో విజయ్‌కు యువత, తొలిసారి ఓటు వేస్తున్న వారి నుంచి అద్భుతమైన మద్దతు లభించింది. మార్పును కోరుకునే ఓటర్లు టీవీకేను ప్రత్యామ్నాయ శక్తిగా భావించడం ఈ అద్భుత ఫలితాలకు ప్రధాన కారణంగా నిపుణులు విశ్లేషిస్తున్నారు.

మిగతా 2లో..

# ఇక సీఎం రేసు షురూ..!!




*పశ్చిమ బెంగాల్‌లో సీఎం ఎంపికకు బీజేపీ కసరత్తు*

పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ పార్టీని ఓడించి మొదటిసారిగా అక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో, ముఖ్యమంత్రి అభ్యర్థి ఎంపిక కోసం బీజేపీ అధిష్టానం తీవ్ర కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో పార్టీని విజయపథంలో నడిపించిన కీలక నాయకులలో ఎవరికి ఈ బాధ్యతలు అప్పగించాలనే దానిపై పార్టీ పెద్దలు సుదీర్ఘ మంతనాలు జరుపుతున్నారు.

*అస్సాంలోనూ సీఎం ఎంపికపై దృష్టి*

అస్సాంలోనూ బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి మరోసారి ఘన విజయం సాధించి అధికారాన్ని నిలబెట్టుకుంది. ఎన్నికల ఫలితాల అనంతరం ఇక్కడ కూడా ముఖ్యమంత్రి ఎంపికపై బీజేపీ దృష్టి సారించింది. ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ నాయకత్వంలోనే ఈ విజయం సాధించడం వల్ల, ఆయననే మరోసారి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టేందుకు పార్టీ నాయకులు కసరత్తును వేగవంతం చేశారు.

## జగన్ అధికారంలోకి రాగానే
# తప్పుడు కేసులు ఎత్తివేత..



అనకాపల్లి జిల్లా అచ్చుతాపురం మండలం దుప్పుతూరు గ్రామంలో బ్రాండెక్స్ గోడ నిర్మాణ పనులపై స్థానికులు తీవ్ర ఆందోళనకు దిగారు. గతంలో ఎస్సీజెడ్ ఏర్పాటు సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకుండా, గ్రామంలో గోడ నిర్మాణం చేపట్టడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కులు రక్షించకుండా న్యాయం లేకుండా చర్యలు చేపట్టడం అన్యాయం అని గ్రామస్తులు తెలిపారు.

ఈ ఆందోళనకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరుణం ధర్మశ్రీ సహా పలువురు నేతలు మద్దతు ప్రకటించారు. గ్రామానికి చేరుకుని బాధితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారని ఆయన తెలిపారు.

మిగతా 2లో..

## నేను ఓడిపోలేదు..
# రాజీనామా చేసే ప్రసక్తేలేదు




- ఎన్నికల ఫలితాలపై మమత ఆగ్రహం.. ఈసీపై తీవ్ర ఆరోపణలు
- “100 సీట్లు దొంగిలించారు”
- పోరాటం కొనసాగిస్తామని హెచ్చరిక
- ఎన్నికల తర్వాత ఉద్రిక్తత.. దాడి జరిగిందని మమత ఆరోపణ
- “మా పోరాటం బీజేపీతో కాదు, ఈసీతో” -- మమత ఫైర్

## రాష్ట్ర ప్రభుత్వం
# రైతు పక్షపాతి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, వారిని అన్ని విధాల ఆదుకుంటుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో నిర్వహించిన “ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక” కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మెగా రైతు మేళాలో మంత్రి పాల్గొన్నారు.

మిగతా 2లో..

## వరంగల్ వేదికగా
# బీఆర్ఎస్ శంఖారావం

- రైతు డిక్లరేషన్ అమలుపై ప్రభుత్వానికి హెచ్చరిక




**వరంగల్ (తెలుగు గళం):** వరంగల్ వేదికగా భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) భారీ బహిరంగ సభకు సిద్ధమైంది. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందనే ఆరోపణలతో ఈ సభను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే ముమ్మరంగా పూర్తయ్యాయి.

హామీల అమలులో వైఫల్యంపై నిరసనగా ఈ సభను నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. రైతులకు అనేక హామీలు ఇచ్చిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక వాటిని గాలికి వదిలేసిందని బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా రుణమాఫీ, రైతు బంధు, పంటల బీమా వంటి అంశాలలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రైతులను తీవ్ర నిరాశకు గురిచేశాయని వారు మండిపడుతున్నారు.

మిగతా 2లో..

## హెల్మెట్ ధరించడం
# ప్రాణరక్షణకు కవచం

- బైక్ ర్యాలీలో పాల్గొన్న హోం మంత్రి వంగలపూడి అనిత



**అమరావతి,తెలుగు గళం మే 5:** రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా, ప్రజలలో అవగాహన కల్పించేందుకు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పాయకరావుపేట నియోజకవర్గంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.మంగళవారం ఉదయం ఎస్.రాయవరం మండలం తిమ్మాపురం ఫ్లైఓవర్ (అడ్డురోడ్డు) వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ, నక్కపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు కొనసాగింది. “సురక్షిత రోడ్లు – సురక్షిత జీవితం” అనే నినాదంతో సాగిన ఈ ర్యాలీలో మంత్రి స్వయంగా హెల్మెట్ ధరించి బైక్ నడుపుతూ సుమారు 500 మంది యువత మరియు పోలీసు సిబ్బందిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా వాహనదారులకు మంత్రి స్వయంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ ప్రాణం వెలకట్టలేనిదన్నారు. రెండు లక్షల రూపాయలు పెట్టి బైక్ కొనేవారు, తమ ప్రాణాన్ని కాపాడే వెయ్యి రూపాయల హెల్మెట్‌ను...

2 లో

# తమిళనాడు సీఎం గా విజయ్..!!

మొదటి పేజీ తరువాయి

గతంలో మరే కొత్త పార్టీ సాధించలేని విధంగా, తొలి ప్రయత్నంలోనే ఇంతటి భారీ విజయాన్ని అందుకోవడం అనేది తమిళనాడు చరిత్రలో ఒక అరుదైన రికార్డు. విజయ్ అనుసరించిన 'థర్డ్ వే' వ్యూహం పూర్తిగా సఫలమైందని చెప్పవచ్చు.

అధికారంలోకి వచ్చాక విజయ్ ఎలాంటి పాలన అందిస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అవినీతి రహిత పాలన అందించడం, సంక్షేమ పథకాలను కొనసాగించడం ఆయన ముందున్న ప్రధాన సవాలు.

ఏదేమైనా, తమిళనాడు రాజకీయాల్లో ఒక కొత్త శకం మొదలైంది. సినీ రంగం నుంచి వచ్చి నేరుగా ప్రభుత్వ పగ్గాలు చేపట్టబోతున్న విజయ్ ప్రయాణం, భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయాల గమనాన్ని పూర్తిగా మలుపు తిప్పనుంది

# వరంగల్ వేదికగా బీఆర్ఎస్ శంఖారావం

## : రైతు డిక్లరేషన్ అమలుపై ప్రభుత్వానికి హెచ్చరిక

మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలో, గతంలో బీఆర్ఎస్ పార్టీ 'రైతు డిక్లరేషన్' ప్రకటించిన వరంగల్ గడ్డపైనే ఈ బహిరంగ సభను ఏర్పాటు చేయడం రాజకీయంగా తీవ్ర ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో ఇచ్చిన డిక్లరేషన్ స్ఫూర్తితోనే ప్రభుత్వాన్ని నిలదీయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. ఈ ప్రాంతం నుంచే రైతుల తరపున మరో పోరాటానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు పార్టీ నేతలు ప్రకటించారు.

సభలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వ లోపాలను ప్రజలకు, రైతులకు పూసగుచ్చినట్లు వివరించనున్నారు. వ్యవసాయ రంగంలో నెలకొన్న ప్రస్తుత సంక్షోభం, ఎరువులు, విత్తనాల కొరత మరియు రైతులకు అందని ఆర్థిక సహాయం వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించి, ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టనున్నారు.

ఈ బహిరంగ సభకు ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి రైతులు, పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. సభ విజయవంతం కోసం బీఆర్ఎస్ నాయకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. రైతుల సమస్యలపై గళమెత్తే ఈ సభ కోసం భద్రతా చర్యలు, ట్రాఫిక్ మళ్లింపు వంటి ఏర్పాట్లు కూడా పరిశీలిస్తున్నారు.

సభ ముగింపులో ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తెచ్చేలా బీఆర్ఎస్ అధిష్ఠానం కొన్ని కీలక డిమాండ్లను ప్రకటించనుంది. రైతులకు ఇచ్చిన ప్రతి హామీని తక్షణమే అమలు చేయాలని, లేకుంటే రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించనున్నారు.

వరంగల్ సభ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయన్నది ప్రస్తుతం సర్వత్రా ఉత్కంఠగా మారింది. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ చేపడుతున్న ఈ ప్రజా పోరాటం రైతుల సమస్యలను ఏ మేరకు పరిష్కరిస్తుందోనని రాజకీయ పరిశీలకులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి

మొదటి పేజీ తరువాయి

## : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని పొంగులేటి తెలిపారు. పంట పెట్టుబడి సాయం, రైతు రుణమాఫీ, మరియు రైతు బీమా వంటి పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామని, అన్నదాతల ముఖాల్లో చిరునవ్వు చూడటమే ప్రభుత్వ ఆశయమని చెప్పారు.

ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని, రైతుల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని ఆయన ఉద్ఘాటించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, మరియు నిరంతర విద్యుత్‌ను అందించడంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడటం లేదని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతులు వ్యవసాయంలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావచ్చని, వాటిని సత్వరమే పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి భరోసా ఇచ్చారు.

# నేను ఓడిపోలేదు.. రాజీనామా చేసే ప్రసక్తేలేదు..

ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసే ప్రసక్తేలేదని మమతా బెనర్జీ ప్రకటించారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాల తర్వాత మమత మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. "నేను ఓడిపోలేదు.. రాజీనామా చేయను. లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌ను కూడా కలవను. తన ఓటమికి ఎన్నికల సంఘమే కారణం. 100 సీట్లను బీజేపీ దొంగిలించింది. కౌంటింగ్ కేంద్రానికి వచ్చినప్పుడు తనపై దాడి కూడా జరిగింది." అని మమత ఆరోపించారు.

ఎన్నికల సంఘంపై మమతా బెనర్జీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "మేము ఎన్నికల్లో ఓడిపోలేదు. గెలవడానికి బీజేపీ ఎన్నికల సంఘాన్ని ఉపయోగించుకుంది. ఎన్నికల సంఘమే అతి పెద్ద విలన్." అంటూ సంచలన ఆరోపణలు చేశారు.

బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ 207 స్థానాలు గెలుచుకోగా.. టీఎంసీ 80 స్థానాలు, కాంగ్రెస్ 5 స్థానాల్లో గెలిచింది. ఈ ఫలితాలపై మమత మీడియా వేదికగా మాట్లాడుతూ ఈసీపై మండిపడ్డారు. ఎన్నికల్లో గెలిచేందుకు బీజేపీ ఎన్నికల సంఘాన్ని ఉపయోగించుకుందని వ్యాఖ్యానించారు.

"మా పోరాటం బీజేపీతో కాదు. ఎన్నికల సంఘంతో. నా జీవితంలో ఇలాంటి ఎన్నికను చూడలేదు. 2004 తర్వాత ఇంతటి అఘాయిత్యాలను చూడలేదు. ఎన్నికల సంఘమే ప్రధాన విలన్. ఎస్ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించారు. బీజేపీ 100 సీట్లను దొంగిలించింది. మమ్మల్ని ఓడించడానికి ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా కుట్ర పన్నారు. మమ్మల్ని ఓడించడానికి బీజేపీ సాధ్యమైన ప్రతీ ఎత్తుగడను ఉపయోగించింది. బీజేపీ కార్యకర్తలు మా కార్యకర్తలపై దాడి చేశారు." అని ఆరోపించారు.

కూటమి అండ..

"ఇండియా కూటమి నాకు అండగా ఉంది. సోనియా గాంధీ, రాహుల్, అరవింద్ కేజ్రీవాల్, ఉద్ధవ్ థాకరే, హేమంత్ సోరెన్, తేజస్వి యాదవ్ అందరూ నాకు ఫోన్ చేశారు. కూటమి నాకు అండగా ఉంది. అఖిలేష్ యాదవ్ రేపు బెంగాల్ వస్తున్నారు." అని పేర్కొన్నారు. "ఇప్పుడు నేను స్వేచ్ఛా పక్షిలా ఉన్నాను. నాకు చేయాల్సిన పని ఉంది. కానీ మేము పోరాటం ఆపం. బీజేపీ అప్పుడే ప్రజలను హింసించడం మొదలుపెట్టింది. వారు షెడ్యూల్డ్ కుల, షెడ్యూల్డ్ తెగల కుటుంబాలపై కూడా దాడి చేశారు. వారిపై అత్యాచారం చేస్తామని బీజేపీ బెదిరించింది. బీజేపీ తన గూండాలతో దాడులు మొదలుపెట్టింది. పోలీసులు చేతులు కట్టుకుని కూర్చున్నారు. మాకు మార్పు కావాలి. ప్రతీకారం కాదు అనే నినాదాన్ని మేము లేవనెత్తాము. ఇది సైనికుల దళమా లేక గూండాల దళమా?." అని మమత ప్రశ్నించారు.

మీడియాపై ధ్వజం : మొదటి విడత ఓట్ల లెక్కింపు తర్వాత... బీజేపీ ఇన్ని స్థానాల్లో ఆధిక్యంలో ఉందంటూ మీడియా వార్తలు ప్రసారం చేయడం మొదలుపెట్టిందని.. అంతే వెంటనే బీజేపీ గూండాలు తనపై దాడి చేశారని ఆరోపించారు. "నా వీపుపైనా, కడుపుపైనా తన్నారు." అని మమత పేర్కొన్నారు.

# నాబార్డు క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

హార్టికల్చర్‌లో రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు రూ.5,313 కోట్లు కేటాయించారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలకు రూ.9,957 కోట్లు, అనుబంధ కార్యకలాపాలకు రూ.12,687 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసింది. అలాగే ఎంఎస్ఎంఈ లకు రూ.1.64 లక్షల కోట్లు చొప్పున కేటాయించింది.

హార్టికల్చర్‌కు అండగా నిలవండి

నాబార్డు క్రెడిట్ ప్లాన్ ఆవిష్కరణ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ హార్టికల్చర్‌ను ప్రోత్సహించాలనే ప్రభుత్వ ఆలోచనలకు మద్దతుగా ఉండాలని బ్యాంకులు, నాబార్డ్ ప్రతినిధులను సీఎం కోరారు. ఈ సందర్భంగా హార్టికల్చర్‌లో ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. ఏడాదికి 450 లక్షల మెట్రికల్ టన్నుల హార్టికల్చర్ ఉత్పత్తులు రాష్ట్రం సాధించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం తెలిపారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో వ్యవసాయం అందులోనూ... హార్టికల్చర్, ఆక్వాకల్చర్ కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఎం అన్నారు. దీనికి అవసరమైన పూర్తి సహకారాన్ని బ్యాంకులు, నాబార్డ్ అందించాలని సీఎం కోరారు. ఈ కార్యక్రమంలో నాబార్డు సీజీఎం ఎం.ఆర్. గోపాల్, జీఎం కెవిఎస్ ప్రసాద్, కెనారా, ఎస్బీఐ, ఎస్ఎల్‌బిసి, ఏపీజీబీ, ఏపీసీవోబీ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించడం ప్రాణరక్షణకు కవచం

మొదటి పేజీ తరువాయి

కొనేందుకు వెనుకాడుతున్నారన్నారు. ప్రాణం కన్నా ఏదీ ఎక్కువ కాదని,మీరు లేకుండా మీ కుటుంబం రోడ్డున పడకూడదంటే హెల్మెట్ ధరించడం తప్పనిసరని చెప్పారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఎవరైనా సరే హెల్మెట్ ధరించాల్సిందన్నారు. రాజకీయ నాయకులు హెల్మెట్ లేకుండా కనిపిస్తే వారికి రెట్టింపు జరిమానా విధించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.నిబంధనల విషయంలో ఎవరికీ మినహాయింపు లేదని చెప్పారు.

ఇటీవల కాలంలో పాయకరావుపేట నియోజకవర్గంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అనేక ప్రాణాలు పోవడం బాధాకరమని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారానే వీటిని అరికట్టగలమని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, పాయకరావుపేట ఇన్స్పెక్టర్ శంకర్రావు, నక్కపల్లి సర్కిల్ సీఐ రామకృష్ణ, నక్కపల్లి ఇన్ స్పెక్టర్ మురళి, స్థానిక ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

# ఇక సీఎం రేసు షురూ..!!

మొదటి పేజీ తరువాయి

**కేరళలో కాంగ్రెస్ సన్నాహాలు**

దక్షిణాది రాష్ట్రమైన కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) భారీ విజయం సాధించింది. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వాన్ని ఓడించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ముఖ్యమంత్రి ఎంపిక కోసం సన్నాహాలు చేస్తోంది. పార్టీలోని సీనియర్ నాయకులు, ముఖ్య నేతల మధ్య ఏకాభిప్రాయం సాధించి, త్వరలోనే సీఎం అభ్యర్థిని ప్రకటించేందుకు కాంగ్రెస్ అధిష్టానం ఏర్పాట్లు ముమ్మరం చేసింది.

**పుదుచ్చేరిలో రంగస్వామికి క్లియర్ అయిన సీఎం సీటు**

ఇక కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఎన్‌డీఏ కూటమి మరోసారి అధికారాన్ని నిలబెట్టుకుంది. ఆల్ ఇండియా ఎన్.ఆర్. కాంగ్రెస్ (AINRC) అధినేత, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి తన నియోజకవర్గాల్లో ఘనవిజయం సాధించారు. కూటమికి అవసరమైన మెజారిటీ స్థానాలు రావడంతో, పుదుచ్చేరిలో రంగస్వామికి ముఖ్యమంత్రి సీటు ఎటువంటి అడ్డంకులు లేకుండా పూర్తిగా క్లియర్ అయింది.

# దశాబ్దాల స్వప్నానికి నాంది.. దక్షిణ కోస్తా రైల్వేకు గ్రీన్ సిగ్నల్

- విశాఖ రైల్వే జోన్ పై గెజిట్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం
- వచ్చెనెల 1నుంచి కార్యకలాపాలు
- కూటమి కృషితో విశాఖ రైల్వే జోన్ సాధ్యం -- అచ్చెన్నాయుడు
- రైల్వే జోన్ ప్రక్రియను వేగవంతం చేసి గెజిట్ విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వానికి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు



శ్రీకాకుళం మే05 ( తెలుగు గళం ) : విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇంగ్లీషు, హిందీ భాషల్లో విడుదలచేసింది. రాష్ట్ర విభజనప్పటినుంచి ఎదురు చూస్తుండగా ఎట్టకేలకు కేంద్ర సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉత్తరాంధ్రుల కలలను

కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే, తూర్పు కోస్తా రైల్వే నుంచి కొన్ని ప్రాంతాలను కలిపి దక్షిణ కోస్తా రైల్వే . గెజిట్ విడుదల చేయడంతో..ఈ ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగం కానుందని అన్నారు. ఆ..రోజు ఎన్నికల హామీలను నిలుపుకునే ప్రయత్నంలో, గత ప్రభుత్వం చేయని విధంగా, చేయలేని విధంగా కూటమి ప్రభుత్వం పనిచేసి, కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి పెంచి అనుకున్నది సాధించిందని హర్షం తెలిపారు.

విధాన సంబంధ నిర్ణయాలలో భాగంగా పలాస – ఇచ్ఛాపురం సెక్షన్ ను విశాఖ డివిజన్ కు బదిలీ చేయడం..ఇచ్ఛాపురం – దువ్వాడ – విజయనగరం సెక్షన్ ను విశాఖ డివిజన్ కు బదిలీ చేయడం, నుప్పాడ–పర్లాకిమిడి, బొబ్బిలి–సాలూరు సెక్షన్లను విశాఖ డివిజన్ కు బదిలీ చేయడం సింహాచలం వడ్లపూడి, విశాఖ జగ్గయ్యపాలెం విశాఖ డివిజన్..కు కలుపుతూ విలీనం చేయడం బాగుందని అభిప్రాయపడ్డారు. కోరాపుట్ – కిరండోల్ లైన్ ను విశాఖ, రాయగడ డివిజన్లకు సంయుక్తంగా కేటాయించడం, రాయగడ నుంచి విడదీసి విశాఖ డివిజన్ (463 కిలోమీటర్ల మేరకు) కు కలుపుతూ దక్షిణ కోస్తాలో విలీనం చేయడం కూడా బాగుందని తెలిపారు. ఆరిలోవలో దక్షిణ కోస్తా రైల్వే శాశ్వత కార్యాలయ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఎంతో మంచి పరిణామం అని పేర్కొన్నారు. వీఎంఆర్డీఏ డెక్‌లోని రెండు అంతస్తుల్లో దక్షిణ కోస్తా రైల్వే జీఎం తాత్కాలిక కార్యాలయం జూన్ 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభించడానికి రంగం సిద్ధం అవుతున్న నేపథ్యంలో సంబంధిత కార్యవర్గానికి తాను శుభాకాంక్షలు చెబుతున్నానని అన్నారు. వెనుకబడిన ప్రాంతపై మరింత శ్రద్ధ వహించిన కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు ఎంతో కృషి చేసిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును అభినందించారు.

# రైతుల గోడు పట్టదా..??

మొదటి పేజీ తరువాయి

వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు కరీంనగర్ లోని ఖాజీపూర్ వద్ద కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. వారు పడుతున్న వెతలను కళ్లారా చూశారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించని విషయాన్ని గమనించారు. ఈ సందర్భంగా రైతులంతా వడ్ల కొనుగోలు కోసం పడిగాపులు కాస్తున్నామని కేంద్ర మంత్రి వద్ద వాపోయారు. తాలు, తరుగు పేరుతో బస్తాకు నాలుగైదు కేజీలు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో రైతు సగటున రూ.20 వేలకుపైగా నష్టపోయే దుస్థితి నెలకొందన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి అనంతరం మీడియాతో కేంద్ర మంత్రి మాట్లాడారు... ఏమన్నారంటే...

రైతుల బాధలు తెలుసుకునేందుకు ఇయాళ ఖాజీపూర్ వద్ద కొనుగోలు కేంద్రానికి వచ్చాను. రైతుల బాధలను కళ్లారా చూస్తున్నా. మండుటెండలో రోజుల తరబడి వాళ్లు వడ్లను విక్రయించేందుకు పడిగాపులు కాస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని విమర్శించారు. ఈ సందర్భగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి స్పందిస్తూ "ఇంకెంతమంది రైతులను బలి కొంటారు? రైతులు చస్తున్నా వడ్లను కొనుగోలు చేయరా? కొనుగోలు కేంద్రాలవద్ద అరిగోస పడుతున్నా స్పందించరా? ప్రతి గింజకు కేంద్రమే పైసలిస్తుంటే కొనడానికి మీకున్న ఇబ్బందేమిటి? వడ్లు కొన్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కమీషన్ కూడా ఇస్తున్నాం కదా? వడ్ల కొనుగోలు కేంద్రాలకు వెళితే మంత్రులను రైతులు కొట్టేటట్లు ఉన్నారు. రైతులను నట్టేట ముంచారు. చేతికి పంట వచ్చేదాకా ఒక టెన్షన్... చేతికొచ్చాక అమ్ముకోవడానికి పడిగాపులు కాయాలా?. 90 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు వస్తే...ఇప్పటిదాకా 15 లక్షల మెట్రిక్ టన్నులే కొంటారా?. కొనుగోలు కేంద్రాలవద్ద టోకెన్లు ఇవ్వడానికి కూడా కమీషన్లు దండుకుంటున్న దుర్మార్గులు. తాలు, తరుగు, తేమ పేరుతో అడ్డగోలుగా దోచుకుంటున్నారు. రైతుల కష్టాన్ని దళారులు దోచుకుంటున్నా స్పందించరా? వాస్తవాలు మాట్లాడితే...మాపై ఎదురు దాడి చేస్తారా? అని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేస్తోంది. ఫీజు రీయంబర్స్ మెంట్ కూడా ఇయ్యలేక ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ వర్గాల విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తారా?. కేంద్రం ఎస్టీ విద్యార్థుల రీయంబర్స్ మెంట్ కోసం నిధులు మంజూరు చేసినా వాడుకోలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ ది. 6 గ్యారంటీలు అమలు చేయడానికి పైసల్లేవంటారు...ఉద్యోగులకు, పెన్షనర్లకు ఇవ్వడానికి నిధుల్లేవంటారు. ఢిల్లీకి కప్పం కట్టడానికి, కేరళ ఎన్నికల కోసం ఖర్చు చేయడానికి వేల కోట్లు ఇస్తారు. రైతులు చచ్చిపోతుంటే కనీసం స్పందించాలనే సోయి కూడా లేదా?. ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన వడ్ల కొనుగోలును వేగవంతం చేయాలి. తాలు, తరుగు, తేమ పేరుతో కటింగ్ లేకుండా వడ్లకు కనీస ధర చెల్లించాలి అని మండి పడ్డారు.

## జగన్ అధికారంలోకి రాగానే

# తప్పుడు కేసులు ఎత్తివేత..

మొదటి పేజీ తరువాయి

అమర్నాథ్ మాట్లాడుతూ, పరిశ్రమలు రావడం అవసరమని అయినప్పటికీ ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా చర్యలు తీసుకోవడం సరిగా లేదని పేర్కొన్నారు. ఇప్పటికీ 750 కుటుంబాలకు పరిహారం అందలేదని, గ్రామాన్ని తరలించే బాధ్యత ప్రభుత్వంపైనే ఉన్నదని స్పష్టం చేశారు.

అమర్నాథ్ మహిళలపై లాఠీచార్జ్ జరిగిన దారుణ ఘటనకు ఆగ్రహం వ్యక్తం చేసి, ఇలాంటి పరిణామాలు ముందుగా జరగలేదని అన్నారు. గ్రామస్తుల డిమాండ్లు న్యాయమైనవని, ముందుగా పరిహారం ఇచ్చిన తర్వాతే గోడ నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు తమ పార్టీకి చెందిన నేతలు పనులు ఆపకూడదని, అవసరమైతే న్యాయపరంగా కూడా పోరాటం చేస్తామన్నారు.

అలాగే, వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి రాగానే గ్రామస్తులపై పెట్టిన తప్పుడు కేసులను రద్దు చేయాలని హామీ ఇచ్చారని అమర్నాథ్ తెలిపారు. దుప్పుతూరు గ్రామంలో ఈ అంశం తీవ్ర ఉద్రిక్తతకు దారితీస్తున్నట్లు, ప్రజలు తమ హక్కుల కోసం పోరాడుతుండగా రాజకీయ నాయకుల మద్దతుతో సమస్య మరింత ప్రాధాన్యం సంతరించుకున్నదని పత్రికకు తెలుస్తోంది.

# పోలీసు కస్టడీకి ఎమ్మెల్సీ అనంతబాబు



కాకినాడ (తెలుగు గళం)మే 05 : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సంచలనం సృష్టించిన డ్రైవర్ వీధి సుబ్రమణ్యం హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబును పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. సాక్షులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపై నమోదైన కేసులో భాగంగా ఈ విచారణ కొనసాగుతోంది. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న అనంతబాబును కోర్టు అనుమతితో పోలీసులు మంగళవారం కాకినాడకు తరలించారు. భారీ భద్రత నడుమ ఆయనను రాజమండ్రి నుండి కాకినాడ రూరల్ పరిధిలోని సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. సాక్షులను బెదిరించడం, ఆధారాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారనే అభియోగాలపై లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు కోర్టును కోరారు. దీనికి స్పందించిన మొబైల్ కోర్టు అనంతబాబును 24 గంటల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు ఆధ్వర్యంలో అనంతబాబు విచారణ కొనసాగుతోంది. సాక్షులకు ఫోన్ చేసి బెదిరించినట్లు వచ్చిన ఆరోపణలపై పోలీసులు ఆయనను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఆయన ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు కాల్ డేటా ఆధారంగా కీలక ఆధారాలను సేకరించే పనిలో పడ్డారు. కస్టడీ ముగిసిన అనంతరం బుధవారం తిరిగి ఆయనను కోర్టులో ప్రవేశపెట్టి రాజమహేంద్రవరం జైలుకు తరలించనున్నారు.

# రాపూరులో భారతీయ జనతా పార్టీ సంబరాలు సంబరాల జోష్



నెల్లూరు జిల్లా రాపూరు(తెలుగు గళం): నెల్లూరు జిల్లా రాపూరు పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్ వద్ద సోమవారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు.ఆదివారం వెలువడిన ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో భాగంగా బీజేపీ మూడు రాష్ట్రాల్లో ఘనవిజయం సాధించడంపై కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ సాధించిన ఫలితాలు చారిత్రాత్మకమని ఆయన పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం సురక్షితంగా ఉంటుందని.బెంగాల్ ప్రజలు మార్పును కోరుకున్నారని తెలిపారు.స్థానిక బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొని భారత్ మాతా కీ జై అంటూ నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో సామర్ల జయసింహ. మనుబోలు శివప్రసాద్. తిరుపతి జనార్ధన్. కరిపం సుబ్రహ్మణ్యం.తిక్కమనేని వెంకటరత్నం నాయుడు.మాదిరెడ్డి ఆదిరెడ్డి. లక్కాకుల కృష్ణ.కసుమూరు శ్రీనివాసులు. అత్తి గోపాల్.చిట్టేటి వెంకటాద్రి.బొక్క వెంకటరమణయ్య.ఇండ్ల రాజశేఖర్.బెల్లం అంకయ్య.మేకల వేమయ్య.ప్రదీప్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీల కొరతపై జిల్లా వ్యాప్తంగా

# రైతులు ఎక్కడిక్కడ రహదారులు దిగ్బంధనం చేయాలి

- జిల్లా కలెక్టర్ సివిల్ సప్లై అధికారుల నిర్లక్ష్య వైఖరి నశించాలి
- లారీ కాంట్రాక్టర్ తో లాలూచీ పడుతున్న సివిల్ సప్లై అధికారులు
- ఎపియం ను గెరావ్ చేసి గన్ని సంచులు పంపిణీ చేయించినా సీపీఐ నాయకులు
- జఫర్గఢ్ ఐకెపి ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సిపిఐ బృందం
- ధాన్యం ఎగుమతులు చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరిక



(తెలుగు గళం న్యూస్ జఫర్గఢ్ మే05)

జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీల కొరతపై జిల్లా వ్యాప్తంగా రైతుల ఎక్కడికక్కడ రహదారులు దిగ్బంధనం చేయాలని జిల్లా కలెక్టర్ సీల్ సప్లై అధికారుల నిర్లక్ష్యం నశించాలని లారీ కాంట్రాక్టర్ తో లాల్చబడుతున్న సివిల్ సప్లై అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ పార్టీ మండల కార్యదర్శి జువారి రమేష్ అన్నారు.గురువారం రోజున కుర్చపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం ను భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ ఆధ్వర్యంలో సందర్శించారు ఈ సందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఐకెపి పిఏసియస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి 20 రోజులు గడుస్తున్నప్పటికీ జిల్లా సహకార శాఖ అధికారి ఆదేశాల మేరకు కొనుగోలు చేయడం లేదని అదే విధంగా ఇట్టి సెంటర్ కు జియో టాకింగ్ మరియు మిల్లు మరియు గోధుమలు ట్యాగ్ చేయకపోవడం వల్ల కాంటాలు వేసి నెల రోజులు అవుతున్నప్పటికీ ధాన్యం మిల్లులకు తరలించడం లేదని అన్నారు. ఇట్టి సెంటరు నిర్వాహన విషయంలోఎపియం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని ఆయన అన్నారు అధికారులు కావాలనే ఉద్దేశపూర్వకంగా రైతులను ఇబ్బందుల గురి చేస్తున్నారు. గత నెల రోజుల నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి మాయిచ్చర్ వచ్చి ఉన్నప్పటికిని లారీలు రావడంలేదని ఇట్టి విషయంలో అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోవడం తీవ్ర నిరాశకు రైతాంగం గురవుతున్నారని కాబట్టి ఆన్లైన్ విధానాన్ని రద్దు చేయాలని గత సంవత్సరం మాదిరిగానే నిర్వహించాలని జిల్లావ్యాప్తంగా లారీలు రానట్లయితే రైతుల ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించడానికి అవకాశం ఇవ్వాలని ఎందుకంటే వానకాలం సమీపిస్తున్నందున వర్షాలు పడితే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంటుందని కాబట్టి జిల్లా కలెక్టర్ పున:రాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షులు యాకుబ్ పాషా సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు వడ్లకొండ సుధాకర్ నాయకులు వేల్పుల పెద్దరాములు మంద బుచ్చయ్య అన్నెపు అజయ్ చిలివేరు ఎల్లయ్య అన్నెపు విష్ణు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి 4 లక్షల రూపాయల ఎల్ ఓ సి చెక్కును అందజేసిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య




తెలుగు గళం న్యూస్ హన్మకొండ మే05

హనుమకొండకు చెందిన మహ్మద్ ఆదిల్ అహ్మద్ అనే బాలుడు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా, అతని చికిత్స కోసం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ప్రత్యేక శ్రద్ధ వహించి రూ.4 లక్షల రూపాయల ఎల్ ఓ సి మంజూరు చేయించారు.మంజూరైన ఎల్ ఓ సి నీ మంగళవారం కనకదుర్గ కాలనీలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఆపత్కాలంలో తమకు ఆర్థిక సహాయాన్ని అందించి అండగా నిలిచిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకి బాధిత కుటుంబ సభ్యులు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# హనుమకొండలో రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా

## – పాల్గొన్న ఎంపీ డాక్టర్ కడియం కావ్య






తెలుగు గళం న్యూస్ హన్మకొండ మే05

హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ కళాశాల మైదానంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ సీతక్కలతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక, సాంకేతిక స్టాళ్లను సందర్శించిన వారు రైతులతో మమేకమై, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాలపై అధికారులు అందిస్తున్న వివరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న మెగా రైతు మేళా రైతు అభివృద్ధికి దోహదపడే కీలక కార్యక్రమమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.రైతు రుణమాఫీ అమలు, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాల ద్వారా రైతులకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని తెలిపారు.అలాగే 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు అందజేస్తూ రైతులకు సహకరిస్తున్నామని చెప్పారు.రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా విభిన్న పంటలను సాగు చేసి ఆదాయం పెంచుకోవాలని సూచించారు.వ్యవసాయ రంగంలో మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ సన్న బియ్యం ఉత్పత్తికి ప్రోత్సాహం అందిస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాన్ని రైతులు పూర్తిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ రెడ్డి, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్ర మోహన్, హార్టికల్చర్ సెక్రటరీ యాస్మిన్ బాషా, వరంగల్-హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# రేగొండలో ఎస్సీ కార్పొరేషన్ రుణ లబ్ధిదారుల ఎంపిక

## దరఖాస్తుదారులకు రేపు సర్టిఫికెట్ల పరిశీలన-- ఎంపీడీవో వెంకటేశ్వరరావు



మండల ప్రజా పరిషత్ కార్యాలయము రేగొండ.

నోటీస్

Rc. No: SC-Corp/2025-26 Action Plan/2026 తేది:04/05/2026

విషయం: రేగొండ మండలం-రేగొండ మండలము నందు ఉన్న షెడ్యూల్ కులాల SC-Corporation 2025-26 సంవత్సరానికి రుణము పొందుటకు OBMMS Online ద్వారా అప్లై చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తుల వెరిఫికేషన్-గురించి.

సందర్భము: 1) The VC&Managing Director (FAC) Telangana, Scheduled Castes CO-OP Development Corporation, LTD., DSS Bhavan, 5th floor Basab Tank Hyd, Lr.RC.NoP1/154/SCAP/25-26, Dated:28.03.2026.

2) శ్రీయుత జిల్లా కలెక్టర్ జయశంకర్ భూపాలపల్లి, గారి లేఖ సం.C/01/scap/2025-26, Date:23.04.2026

అర్హత ప్రమాణాలు (Eligibility Criteria)

ఆదాయ పరిమితి (Income Limit):

అవసరమైన పత్రాలు (Documents Required):

మండల పరిషత్ అభివృద్ధి అధికారి
మండల ప్రజా పరిషత్ రేగొండ.

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

రేగొండ మండల పరిధిలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 7వ తేదీ గురువారం సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఎం.వెంకటేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు.స్థానిక రైతు వేదిక భవనంలో ఉదయం 10:30 గంటల నుండి ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.మండల వ్యాప్తంగా వివిధ ఉపాధి పథకాల కోసం మొత్తం 126 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని,వీరందరూ తప్పనిసరిగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు మరియు దరఖాస్తు ఫారాలతో నిర్ణీత సమయానికి హాజరుకావాలని సూచించారు.ఈ పరిశీలన కార్యక్రమానికి టీజీబీ బ్యాంక్ అధికారులు ఎస్సీ కార్పొరేషన్ అధికార ప్రతినిధులు హాజరై అభ్యర్థుల అర్హతలను,ధృవీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తారని ఎంపీడీవో వెల్లడించారు.ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు,కార్యదర్శులు తమ పరిధిలోని లబ్ధిదారులకు ఈ సమాచారాన్ని చేరవేసి,వారు సకాలంలో హాజరయ్యేలా చొరవ తీసుకోవాలని ఆదేశించారు.స్వయం ఉపాధి రుణాల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలనుకునే అర్హులైన దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# పశువుల అక్రమ రవాణా నిరోధానికి చర్యలు : ఎస్పీ



రాష్ట్ర ప్రభుత్వం, సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లాలో పశువుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, తెలిపారు. అక్రమంగా పశువులను తరలించే వ్యక్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు... సుప్రీం కోర్టు ఆదేశాల అమలులో భాగంగ జిల్లాలోని నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ సబ్ డివిజన్ ల పరిధిలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, గోసంరక్షణ సమితి, బీజేపీ యువమోర్చా తదితర హిందూ సంఘాల సభ్యులతో పశువుల అక్రమ రవాణా నిరోధంపై స్ నిర్వహించి చట్టపరమైన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మరియు పోలీస్ శాఖ చేపడుతున్న చర్యల గురించి వివరించారు.. ఈ సందర్భంగా హిందూ సంఘాల సూచనలను స్వీకరించిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... పశువులను అక్రమంగా రవాణా చేయడం చట్టరీత్యా శిక్షార్హమైన నేరమని, ఇది మూగజీవాల పట్ల క్రూరత్వానికి దారితీస్తుందని అన్నారు.. పశువుల అక్రమ రవాణా నిరోధానికి జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, రాత్రింబగళ్లు వాహనాలను తనిఖీలు నిర్వహిస్తున్నామని, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహిస్తూ అనుమానాస్పద వాహనాలపై నిఘా ఉంచుతున్నామని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (BNS) చట్టాల కింద కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

# ముగ్గురు గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

- కొత్తపల్లిగోరి ఎస్సై సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి టీం సాహసోపేత ఆపరేషన్
- సీఐ కరుణాకర్ రావు ఆధ్వర్యంలో ప్రెస్ మీట్

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి పోలీస్ స్టేషన్ పరిధిలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు.పోలీసులు నిర్వహించిన మెరుపు దాడిలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి సుమారు ఒక లక్ష రూపాయల విలువైన 2.310 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ విజయవంతమైన ఆపరేషన్‌లో కొత్తపల్లిగోరి ఎస్సై సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి కీలక పాత్ర పోషించి నిందితులను పట్టుకోవడంలో ధైర్యసాహసాలను ప్రదర్శించారు.




ఎస్సై సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో చాకచక్యంగా తనిఖీలు

జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు జిల్లాలో గంజాయి నిర్మూలనకు చేపట్టిన చర్యల్లో భాగంగా, కొత్తపల్లిగోరి ఎస్సై సాయి త్రిలోక్ నాథ్ రెడ్డికి అందిన విశ్వసనీయ సమాచారంతో ఈ ఆపరేషన్ నిర్వహించారు.ఎస్సై తన పోలీసు బృందంతో కలిసి జెంషెడ్ బేగ్ పేట బ్రిడ్జ్ సమీపంలో అత్యంత అప్రమత్తంగా వాహన తనిఖీలు చేపట్టారు.ఈ క్రమంలో రేగొండ వైపు నుండి నంబర్ ప్లేట్ లేని పల్సర్ బైక్‌పై అనుమానాస్పదంగా వస్తున్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను గమనించి ఒక్కసారిగా వెనుదిరిగి పారిపోవడానికి ప్రయత్నించారు.అయితే ఎస్సై సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి ఏమాత్రం ఆలస్యం చేయకుండా తన సిబ్బందితో కలిసి నిందితులను చాకచక్యంగా వెంటాడి, వారు తప్పించుకోకుండా బంధించి అదుపులోకి తీసుకున్నారు.వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్లను సోదించగా 2.310 కిలోల గంజాయి బయటపడింది.




తల్లిదండ్రులు పిల్లలపై కన్నేసి ఉంచాలి:సిఐ కరుణాకర్ రావు

కొత్తపల్లి గోరి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గణపురం సర్కిల్ సిఐ కరుణాకర్ రావు వివరాలు వెల్లడించారు.అరెస్టయిన వారిలో బైరగాని గణేష్ (16), పాయం వర్షిత్ (17), బీస ప్రవీణ్ (23) ఉన్నారని తెలిపారు. నిందితులు ఒరిస్సాలోని మల్కాన్‌గిరి సరిహద్దుల నుండి గంజాయి తీసుకువచ్చి ఇక్కడ విక్రయించాలని ప్లాన్ చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలు ఎవరితో తిరుగుతున్నారు, ఏం పనులు చేస్తున్నారు అనే అంశాలపై కచ్చితమైన అవగాహన కలిగి ఉండాలని, వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

జిల్లాలో 'ఈగల్ టీమ్స్' అప్రమత్తం

జిల్లాలో మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ప్రత్యేకంగా 'ఈగల్ టీమ్స్'ను సిద్ధం చేశారని సిఐ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా టాస్క్ ఫోర్స్ బృందాలు సంచరిస్తూ గంజాయి సాగు,రవాణాపై క్షుణ్ణంగా నిఘా ఉంచుతున్నాయని స్పష్టం చేశారు. యువత భవిష్యత్తును నాశనం చేసే మాదక ద్రవ్యాల జోలికి ఎవరు వచ్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాణాలకు తెగించి నిందితులను పట్టుకున్న ఎస్సై సాయి త్రిలోక్ నాథ్ రెడ్డిని పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గోరి ఎస్సై 2 షా ఖాన్,హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ కృష్ణ,హరీష్,స్వామి తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో గృహాలు పంపిణీ చేపట్టాలి.




కడపజిల్లా (తెలుగు గళం)

మే05: రాష్ట్ర ప్రభుత్వం జమ్మలమడుగు మండలం, గూడెం చెరువు వద్ద ఉన్న టిడ్కో గృహాలను ప్రజలకు పంపిణీ చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరనాల శివ నారాయణ డిమాండ్ చేశారు.మంగళవారం నాడు జమ్మలమడుగు లో స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం నందు విలేఖరుల సమావేశం శివనారాయణ మాట్లాడుతూ 2014 లో టీడీపీ ప్రభుత్వం హయాంలో గూడెం చెరువు వద్ద దాదాపు 1400 అప్పుడు కట్టిన ఎన్టీఆర్ గృహాలు ప్రజల వద్ద 500,25000,50000 మూడు రకాలుగా బ్యాంక్ లో డిపాజిట్ కట్టించి ఇళ్లు ఇస్తామని చెప్పారని తర్వాత 2019 ప్రభుత్వం మారిన తరవాత టిడ్కో పేరుతో ఇస్తామని ఐదు సంవత్సరాలుగా ప్రజలకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేసిందని అన్నారు.తరవాత మళ్ళీ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటిన ఇప్పటికీ ప్రజలకు టిడ్కో గృహాల పంపిణీ ప్రజలకు జరగలేదని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా కూడా ప్రజలకు టిడ్కో గృహాలు ఇస్తామని చెప్పారన్నారు.ఇళ్లు లేని వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని, కనుక ప్రభుత్వం ఇప్పటికైనా ఆలోచించి టిడ్కో గృహాలను ప్రజలకు పంపిణీ చేపట్టాలని కోరుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రామకృష్ణ,రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్ కోల శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం 10 లక్షల రూపాయలచెక్కు అందజేత

## 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

## నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



**తెలుగు గళం న్యూస్ నర్సంపేట / ముత్తోజిపేట మే 5**

నర్సంపేట మండలం ముతోగిపేట గ్రామంనికి చెందిన ఆర్టిసి డ్రైవర్ కోల శంకర్ గౌడ్ ఇటీవల జరిగిన ఆర్టీసీ సమ్మెలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న నర్సంపేట డిపోకు చెందిన ఆర్టిసి డ్రైవర్ కోల శంకర్ గౌడ్ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తరపున 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి సహకారంతో సంబంధిత 10 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేసిన ఆర్డీవో ఉమారాణి గారు,మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీ లక్ష్మీ రామానంద్ ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్ కాటం భాస్కర్ ,వైస్ చైర్మన్ గంధం నరేంద్ గుప్తా ,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య ఈ సందర్భంగా ప్రభుత్వం ఎల్లవేళలా శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా శంకర్ గౌడ్ గారి కుమారుడు కోల హేమంత్ కు ఉద్యోగం ఇచ్చేందుకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆర్టిసి ఎండి గారితో మాట్లాడడం జరిగిందని ..ప్రభుత్వాన్ని లేఖ కూడా పంపించారని తెలిపారు అతి త్వరలో శంకర్ గౌడ్ కుమారుడు హేమంత్ కు కార్పొరేషన్ లో ఉద్యోగం ఇప్పించడం జరుగుతుందని



అన్నారు. వారి వెంట స్థానిక 2వ వార్డు కౌన్సిలర్ కాంపెల్లి వీణ-విజేందర్ రెడ్డి,5వ వార్డు కౌన్సిలర్ పొన్నాల మనిషా ప్రకాష్, టౌన్ అధ్యక్షులు కటారి ఉత్తమ్ కుమార్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు మండ రాజు గౌడ్,సోషల్ మీడియా ఇన్ఛార్జ్ దేవోజు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# దివంగత ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబానికి కేటీఆర్ పరామర్శ

- బిఆర్ఎస్ పార్టీ తరపున 5లక్షల ఆర్థిక సాయం అందించిన కేటీఆర్



**తెలుగు గళం న్యూస్ నర్సంపేట / ముత్తోజిపేట మే 5**





నర్సంపేట నియోజకవర్గం లోన ముత్తోజిపేట గ్రామంలో దివంగత ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ నివాసానికి వెళ్లిన కేటీఆర్, ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఇటీవల ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ కుటుంబాన్ని కేటీఆర్, బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పరామర్శించారు.

కేటీఆర్ మాట్లాడుతూ

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ టి.ఎస్.ఆర్.టి.ఎస్ లో ఆనాడు కేసీఆర్ ప్రభుత్వంలో కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లను కేబినెట్‌లో చర్చించి, తదనంతరం వారిని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ఆ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేశాము కానీ, దురదృష్టవశాత్తు సంస్థ విలీనాన్ని కేబినెట్ ఆమోదించిన వెంటనే ఎన్నికలు రావడం, ఆ తర్వాత మేము ఓడిపోవడం, అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ కూడా స్పష్టమైన హామీ ఇచ్చింది. వెంటనే ఆర్టీసీని విలీనం చేయడంతో పాటు కార్మికులకు న్యాయం చేసే విధంగా పీఆర్సీ ఇవ్వడం, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన తర్వాత వచ్చే అన్ని హక్కులు కల్పిస్తామని వాగ్దానం చేసింది. కానీ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా, 100 రోజుల్లో చేస్తామని చెప్పిన పనిని చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగారు. ఆ సమ్మె సమయంలో నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ శ్రీ శంకర్ గౌడ్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టాలని కోరుతూ ఆత్మహుతికి పాల్పడ్డారు.

దురదృష్టవశాత్తు శంకర్ గౌడ్ మరణించిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా మా నాయకులు నర్సంపేటకు వచ్చి ఆ కుటుంబానికి అండగా నిలబడాలని ప్రయత్నిస్తే, మమ్మల్ని ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. సుదర్శన్ రెడ్డి ని అయితే అంత్యక్రియల రోజున 12 పోలీస్ స్టేషన్లకు తిప్పి, చివరకు ఖమ్మం జిల్లాలోకి తీసుకెళ్లి నిర్బంధించారు. ఇక్కడ కనీసం ఆ కుటుంబానికి న్యాయం చేస్తారా అంటే, ఈరోజు మేము వస్తున్నామని తెలిసి ప్రభుత్వం ప్రకటించిన 10 లక్షల రూపాయలు కూడా ఇన్ని రోజుల తర్వాత గుర్తొచ్చి ఇచ్చారు. మేము కూడా పార్టీ తరపున ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి అండగా ఉంటాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ కార్మికులకు కూడా తప్పకుండా మద్దతుగా నిలుస్తాం.

మా ప్రభుత్వంలోనే మిమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వం. కానీ మా ప్రభుత్వం మారడంతో, ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చింది. మీరు దయచేసి ధైర్యం కోల్పోకుండా, అందరం కలిసికట్టుగా పోరాడుదాం. మీకు న్యాయం జరిగే వరకు, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకునే వరకు మీ తరపున మేము గొంతు విప్పుతూనే ఉంటాం. మీతో కలిసి నడుస్తాం. అయితే ఎవరూ శంకర్ గౌడ్ లాగా ప్రాణత్యాగాలు చేయవద్దని, మీ కుటుంబాలకు దుఃఖం మిగల్చవద్దని మనవి చేస్తున్నాను. ఇలాంటి సమయంలో రాజకీయాలు పక్కన పెట్టి అందరం కలిసి వారి కుటుంబానికి, అలాగే ఆర్టీసీ కార్మికులకు అండగా నిలుద్దాం. ఈ కార్యక్రమంలో కేటీఆర్ వెంట మండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదన చారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్ల ధర్మారెడ్డి, మాజీ ఎంపీ మలోతు కవిత ఉన్నారు.

# నేడు జరిగే వరంగల్ రైతు సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలి

## రైతు డిక్లరేషన్ పేరిట రైతులకు కాంగ్రెస్ చేసిన మోసాలను

## పోరాటాల గడ్డ వరంగల్ వేదికగానే ఎండగడదాం

## పర్వతగిరి మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు

**తెలుగుగళం,పర్వతగిరి / మే 5 :**

పర్వతగిరి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్ ఆదేశాల పిలుపు మేరకు పర్వతగిరి మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు ఆధ్వర్యంలో మండల ముఖ్య నాయకులు సమావేశామై మండల నాయకులు మాట్లాడుతూ నేడు 6వ తారీఖు నాడు ఉదయం 9:30 గంటలకు హనుమకొండ హంటర్ రోడ్ లో గల సి ఎస్ ఆర్ గార్డెన్ సర్కిల్లో జరుగు "రైతు సంగ్రామ సదస్సు"ను విజయవంతం చేయవలసిందిగా పర్వతగిరి మండల బిఆర్ఎస్ కార్యకర్తలను మరియు రైతులకు పిలుపునివ్వడం జరిగింది. నాలుగు సంవత్సరాల క్రితం వరంగల్ వేదికగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్‌లోని హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని, అన్ని దగా చేసింది కాంగ్రెస్ సర్కార్ అని మండల పార్టీ నాయకులు తీవ్రంగా విమర్శించారు.

ఈ సమావేశంలో మండల అధ్యక్షులుఎర్రబెల్లి రాజేశ్వర్ రావు మాట్లాడుతూ,రైతులకు పెద్ద ఎత్తున హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం,వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతు సంక్షేమం పేరుతో మాటలు మాత్రమే చెప్పి, అమలులో మాత్రం వెనుకబడిందని విమర్శించారు.

అలాగే రైతుల పంటలు కొనుగోలు చేయడంలో రేవంత్ సర్కారు పూర్తిగా వైఫల్యం అయిందని పేర్కొన్నారు.నెల రోజుల దాటినా కూడా రైతుల ధాన్యం,మొక్కజొన్న, పంటలు కొనుక్కోలు చేయకుండా రైతుల ఉసురు తీసి అష్టకష్టాలు పెడుతుందని



అన్నారు.సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. పంటలకి కనీస మద్దతు ధర,సాగునీటి, కరెంటు సమస్యలు వంటి కీలక అంశాలలో రైతులు ఇంకా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అదే వరంగల్ గడ్డపై ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందని, రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు.రేపటి రైతు సంగ్రామ సదస్సుకు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ,మాజీ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు , మాజీ వరంగల్ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ఏడుదోట్ల జితేందర్ రెడ్డి , మాజీ డైరెక్టర్ లు పట్టపురం ఏకాంతం గౌడ్ బోయినపల్లి యుగేందర్ రావు,పర్వతగిరి మాజీ పిఎసిఎస్ చైర్మన్ మనోజ్ కుమార్ గౌడ్, మాజీ మండల రైతు బంధు అధ్యక్షులు చిన్నపాక శ్రీనివాస్ , మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రంగు కుమార్,సోమారం సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్,మాజీ సర్పంచులు గోరు గుట్ట తండా బానోత్ వెంకన్న , మాజీ కో. ఆప్షన్ సభ్యులు షబ్బీర్ అలీ, బోట్ల మధు, బూర శ్యామ్,జంగిలి యాకయ్య,సోషల్ మీడియా మండల కన్వీనర్ బోట్ల భాస్కర్,చిరుత విజయ్ దోమ్మటి రాజు,పిట్టల రాజు,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వండి

## 15 ఫైనాన్స్ నిధులపై డీపీఓ కల్పన దిశానిర్దేశం



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 5**

వరంగల్ జిల్లా:పర్వతగిరి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పర్వతగిరి,వర్ధన్నపేట మండలాల పంచాయతీ కార్యదర్శులకు 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా పంచాయతీ అధికారి కల్పన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.15వ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి పేమెంట్స్, సిటిజన్ సర్వీసెస్‌లో పంచాయతీ కార్యదర్శులు చేయాల్సిన పనులపై ఆమె దిశానిర్దేశం చేశారు.డీపీఓ కల్పన మాట్లాడుతూ... "ప్రతి గ్రామ పంచాయతీలో సర్పంచ్, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి అందరూ కలిసి గ్రామానికి వచ్చిన నిధులు,వాటి నిబంధనలకు లోబడి మాత్రమే పనులు చేయాలి. గ్రామ అవసరాలను గుర్తించి,నిధుల లభ్యత ప్రకారం ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలి. నిబంధనలు పాటించకుండా పనులు చేస్తే ఆన్‌లైన్ ప్రకారం బిల్లులు చెల్లించడానికి వీలుకాదు. కాబట్టి కార్యదర్శులు సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు అవగాహన కల్పిస్తూ పనులు చేయాలి"అని సూచించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ డీఎల్‌పీఓ వేదవతి,ఎంపీఓ శేషు,డీపీఎం దివ్యతో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# అక్యుట్ కిడ్నీ ఇంజురీ కేసును విజయవంతంగా నిర్వహించిన, మలక్ పేట్ యశోదా వైద్యబృందం.




**తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం / మే 06, ఖమ్మం జిల్లా :**

ఖమ్మం స్థానిక ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మూత్రపిండ వ్యాధుల వైద్యనిపుణులు మలక్ పేట్ యశోదా హాస్పిటల్ డాక్టర్ చేతన్ వీరమనేని మాట్లాడుతూ, ఇటీవలే ఖమ్మం జిల్లాకు చెందిన, కోతపల్లి మంగమ్మ 51 సంవత్సరాలు, డయాబెటిక్ మరియు హైపర్టెన్షన్ తీవ్రమైన స్థితిలో ఆస్పత్రిలో చేరారు. ఆమెకు కమ్యూనిటీ ఆక్వైర్డ్ న్యూమోనియా తో పాటు సెప్టిక్ షాక్ మరియు మల్టీ ఆర్గన్ డిస్ఫంక్షన్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. కాళ్లలో వాపు, తీవ్ర శ్వాస ఇబ్బంది, మూత్ర విసర్జన తగ్గడం వంటి లక్షణాలతో వచ్చారు. ఇది కిడ్నీ పనితీరు అకస్మికంగా దెబ్బతిన్నట్లు సూచించింది. అక్యుట్ కిడ్నీ ఇంజురీ అనేది తీవ్రమైన మరియు ప్రాణాపాయ స్థితికి దారితీసే వ్యాధి. ప్రారంభ దశలో గుర్తించి సరైన చికిత్స అందిస్తే ఇది నియంత్రించవచ్చు. అలస్యమైతే అవయవ వైఫల్యం పెరిగి, డయాలిసిస్ పై ఆధారపడే పరిస్థితి లేదా మరణానికి కూడా దారితీసే ప్రమాదం ఉంటుంది. డెసిల్ రిప్లేస్ మెంట్ థెరపీ సిఆర్ఆర్టి(ఆక్స్ డేల్స్ ఫిల్టర్) నిర్వహించి , అనంతరం 2 సార్లు ఎస్.ఎల్.ఈ.డి డయాలిసిస్ చేసాము. సంక్లిష్ట లక్షణాల నియంత్రణ మూత్రంలో రక్తం పడటం , హిమాచూరియా , హీమోప్లైసిస్ వంటి క్లిష్టమైన సమస్యలకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ప్రత్యేక చికిత్స చేసి నయం చేశామని పేర్కొన్నారు.

ఈ కేసులో మలక్ పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అత్యాధునిక నెఫ్రాలజీ సేవలు మరియు ఖచ్చితమైన నిర్ధారణ సామర్థ్యాన్ని మరోసారి నిరూపించింది అని పేర్కొన్నారు.

# మర్రి కామయ్య 69వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**చింతపల్లి తెలుగు గళం న్యూస్:-** మన్యంలో ఆంగ్లేయులపై పోరాడిన యోధుడు, అల్లూరి సీతారామరాజు నీళ్ళ సమకాలికుడు మర్రి కామయ్య 69వ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం చింతపల్లి మండల కేంద్రంలో ఆర్ అండ్ బి కార్యాలయం వద్ద ఘనంగా నివాళులర్పించారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చింతపల్లి, గూడెం మండలాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మర్రి కామయ్య విగ్రహానికి పూలమాల వేసి గణనీయంగా నివాళులు అర్పించారు.దఈ సందర్భంగా వంతల సుబ్బారావు మాట్లాడుతూ, బ్రిటిష్ ముఠాదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా దశాబ్దాల పాటు పోరాడిన మర్రి కామయ్య ఆదివాసీ గిరిజనులకు చైతన్యం కలిగించిన మహనీయుడని అన్నారు. శిస్తు కప్పం చెల్లించవద్దని పిలుపునిస్తూ, కొండపోడు పట్టాలతో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న గిరిజనులను సమీకరించి ఆంగ్లేయులపై సాయుధ పోరాటానికి నడిపించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయడంతో పాటు, ఆయన చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వంతల బాబురావు, సీనియర్ నాయకులు మర్రి మనోహర్, గుంట కోటి, పాంగి కృష్ణ (మాజీ సర్పంచ్, పెదవలస), గూడెం మండలం మర్రి కామయ్య ఆదిమజాతి సేవా సంఘం మండల అధ్యక్షుడు కొర్ర జగన్, మొట్టడం బాలరాజు (మాజీ బ్యాంకు డైరెక్టర్), వంతల సత్యనారాయణ (మాజీ సర్పంచ్), గుంట రాజుబాబు, యువ నాయకులు శ్రీనుబాబు, పాంగి శ్రీనుబాబు, మర్రి రాంబాబు, వంతల రవి, కొర్ర చిన్నారావు, చిన్నబ్బాయి, జీ.మాడుగుల మండల గౌరవ అధ్యక్షుడు తెరవాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలి:జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

జిల్లాలో పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఒక ప్రకటనలో సూచించారు.వేసవిలో వడదెబ్బ (హీట్ స్ట్రోక్) ప్రాణాంతకమని, ముందస్తు జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రాణ రక్షణ పొందవచ్చని ఆయన తెలిపారు. ప్రత్యేకించి చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు,ఎండలో శ్రమించే కూలీలు అధిక జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.డీహైడ్రేషన్ సమస్య తలెత్తకుండా ప్రతిరోజూ కనీసం 12 నుండి 15 గ్లాసుల నీరు తాగాలని, మజ్జిగ, కొబ్బరినీళ్లు, ఎలక్ట్రోలైట్ ద్రావణాలు తీసుకోవడం మంచిదని సూచించారు.ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని కలెక్టర్ కోరారు.బయట పనిచేసే వారు ప్రతి 20 నిమిషాలకు ఒకసారి కనీసం ఐదు నిమిషాల పాటు నీడలో విశ్రాంతి తీసుకోవాలని,ప్రయాణాల్లో తప్పనిసరిగా తలకు టోపీ, కాటన్ గుడ్డ లేదా సన్ గ్లాసెస్ ధరించాలని తెలిపారు. ఆహార విషయంలో మితంగా తినాలని, కారం,మసాలాలు తగ్గించి పుచ్చకాయ, కీరదోస, తాటి ముంజలు వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు,కూరగాయలను తీసుకోవాలని సూచించారు.ఆల్కహాల్, సిగరెట్లు, కార్బొనేటెడ్ పానీయాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.జ్వరం, తలనొప్పి, కళ్ళు తిరగడం, వాంతులు, విరోచనాలు, అపస్మారక స్థితి వంటివి వడదెబ్బ లక్షణాలని, ఇవి కనిపిస్తే బాధితుడిని వెంటనే చల్లని ప్రదేశానికి చేర్చి తక్షణ వైద్య సహాయం అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గ్రామ పంచాయతీలు, ఆశా సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచామని,వీటిని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాహుల్ శర్మ కోరారు.

# కడప పోలీస్ బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియలో పారదర్శకం..




**కడపజిల్లా(తెలుగు గళం) మే05:** పారదర్శకంగా బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ చేపట్టిన కడపజిల్లా ఎస్పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపిఎస్ తెలుపుతూ జిల్లాలో 54 మంది పోలీసులకు సాధారణ బదిలీల్లో భాగంగా మంగళవారం వైఎస్ఆర్ కడపజిల్లా లోని పోలీస్ స్టేషన్లలో ఒకే చోట 5 ఏళ్ళ సర్వీసు పూర్తి చేసుకున్న పోలీసు సిబ్బందికి బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టినట్లు జిల్లా ఎస్పి నచికేత్ తెలిపారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియకు 5 మంది ఏఎస్ఐ లు,17 మంది హెడ్ కానిస్టేబుళ్ళు,32 మంది కానిస్టేబుళ్లు,మొత్తం 54 మంది కౌన్సిలింగ్ కు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్పి నచికేత్ తమ పోలీస్ శాఖ సిబ్బంది పలు సూచనలు చేశారు. ఒకే పోలీస్ స్టేషన్ లో 5 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న పోలీసులకు నిబంధనల ప్రకారం పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు.తమ సొంత మండలం కాకుండా ఇతర పోలీస్ స్టేషన్ లు ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఖాళీల ఆధారంగా ఉన్న పోలీస్ స్టేషన్లను ఎంచుకోవాలని సూచించారు.పోలీసు సిబ్బందికి కోరుకున్న చోటుకే బదిలీలు జరగడంతో బదిలీల పట్ల పోలీస్ సిబ్బంది అందరూ ఆనందం వ్యక్తం చేశారు.ఈకార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.ప్రకాష్ బాబు,స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ ఎన్.సుధాకర్,జిల్లా పోలీస్ కార్యాలయ ఏఓ సుజాత,సూపరింటెండెంట్ శ్రీనివాస నాయక్,పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్,డిపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

# గోపనపల్లిలో ఉపాధి హామీ పనులు పరిశీలించిన

## పర్వతగిరిఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్

**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే5**

వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలంలో ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ శనివారం రోజున గోపనపల్లి,చౌటపల్లి గ్రామాలలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న రోడ్డు పనిచేస్తున్న కూలీల హాజరును పరిశీలించి ఎక్కువ మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.అలాగే అన్ని గ్రామాల్లో పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు ( త్రాగునీరు , నీడ , మెడికల్ కిట్) ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పని చేస్తున్న కూలీల హాజరును తనిఖీ చేశారు. అనంతరం ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ కూలీలతో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 150 మంది కూలీలు పని చేయాలని, రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నందున ఉదయం 6 గంటలకు పనులు మొదలు పెట్టి 10 గంటల వరకు పని చేయాలని, కొలతల ప్రకారం పని చేయాలని సూచించారు.అలాగే పనిని నాణ్యతతో చేయాలని తెలిపారు. అనంతరం గ్రామంలో ఉన్న నర్సరీ లను సందర్శించి ఖాళీగా ఉన్న బాగ్స్ లలో నారు లేదా విత్తనాలు పెట్టాలని,వానసేవక్ ప్రతి రోజూ ఉదయం 7 లోపు మరియు సాయంత్రం 5 తరువాత నీళ్లు పట్టాలని, ప్రతి ఒక్క బ్యాగ్ లో మొక్కలు ఖచ్చితంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి పాషా మరియు అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్ విక్రమ్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, కూలీలు, వానసేవక్ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పర్వతగిరి సర్పంచ్ శంకర్,రూర్బన్ డి ఈ,రఘు వంశీ ఏపీవో సుశీల్, ఈసీ రాజు, టి ఏ సురేష్,రాజేష్,ఫీల్డ్ అసిస్టెంట్ లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు



# పకడ్బందీగా ధాన్యం సేకరణ



**నల్లగొండ (తెలుగు గళం):** రబీ ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని, మిల్లుల వద్ద అన్లోడింగ్ పెంచాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అధికారులను ఆదేశించారు. నల్గొండ జిల్లాలోని , చిట్యాల నార్కట్ పల్లి మండలాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన దాన్యం వివరాలు, హమాలీలు, ట్రక్ షీట్లు, మిల్లుల ట్యాగింగ్ చేసిన వాహనాలు, టార్పాలిన్లు, తదితర వివరాలను పరిశీలించి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కమీషనర్ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ... ట్యాబ్ ఎంట్రీ నూటికి నూరు శాతం కావాలని, కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని శుభ్రపరిచేందుకు డ్రయ్యర్లు, శుభ్రపరిచే విధానాలను ఏర్పాటు చేయాలని అన్నారు.. అవసరమైన చోట అదనపు హమాలీ లు ఏర్పాటు చేసుకొని కొనుగోళ్లు వేగవంతం చేయాలని, అకాల వర్షాల నుంచి రక్షణ ఏర్పాట్లు చేయాలని సూచించారు...

# మక్కలు,వరి కొనుగోలులో జాప్యం

## ఇల్లంద మార్కెట్ వద్ద బీజేపీ కిసాన్ మోర్చా భారీ ధర్నా




**తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట/మే 5**

వరంగల్ జిల్లా:వర్ధన్నపేటమండలం ఇల్లంద వ్యవసాయ మార్కెట్లో మక్కలు,వరి ధాన్యం కొనుగోలు జరగకపోవడం కాంటా అయిన మక్కలు ట్రాన్స్‌పోర్ట్ కాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు.బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్లో రైతులతో మాట్లాడిన అనంతరం కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బసవపురం లక్ష్మీ నరసయ్య,జిల్లా ఇన్చార్జి కొండపల్లి శ్రీధర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు,కొండేటి శ్రీధర్ తదితరులు జాతీయ రహదారి 563పై ధర్నాకు దిగారు.దీంతో రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది.నేతల ఆరోపణలు..

రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ వేదికగా ఇచ్చిన రైతు డిక్లరేషన్ అమలులో విఫలమైంది.ధాన్యంసేకరణలో మొద్దు నిద్ర వహిస్తోంది.కేంద్రం గోనె సంచులు ఇస్తున్నా రైతులకు అందించకుండా కమిషన్ల కోసం పనిచేస్తోంది.మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులను పట్టించుకోవడం లేదు అని బసవపురం లక్ష్మీ నరసయ్య ఆరోపించారు.పంట బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలని,రైతు భరోసా,సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు.ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని వరంగల్ మార్కెట్ డీఎంకు ఫోన్‌లో విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ధర్నా చేస్తున్న బీజేపీ నేతలను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి వన్నాల వెంకట రమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జలగం రంజిత్ రావు,సిద్ధం నరేష్,మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు గార్లపాటి మంజులరెడ్డి,వర్ధన్నపేట కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి,మండల అధ్యక్షుడు అడప రాజు, సర్పంచులు,బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

# రాయలసీమ ఎత్తిపోతల పథకం భవిష్యత్తు కార్యాచరణపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం కు నేదురుమల్లి




**నెల్లూరు జిల్లా నెల్లూరు(తెలుగు గళం):**–రాయలసీమ ఎత్తిపోతల పథకం కేవలం నీటి ప్రాజెక్ట్ మాత్రమే కాదు ––– ఇది రైతుల జీవనోపాధిని మెరుగుపరచే, కరువు నుంచి విముక్తి కలిగించే, ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడే కీలక ప్రాజెక్ట్. ఆ ప్రాజెక్ట్ భవిష్యత్ కార్యాచరణ పై మంగళవారం నెల్లూరులో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంకు/ ఉమ్మడి నెల్లూరు వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త శ్రీలినేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి వెంకటగిరి నియోజకవర్గంలోని పలువురు రైతులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం సభను ఉద్దేశించి వెంకటగిరి నియోజకవర్గ రామ్ కుమార్ రెడ్డి రాయలసీమ ఎత్తుపోతల పథకం భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు గురించి మాట్లాడారు.

# చలివేంద్రం ఉందా.. చనిపోయిందా? రేగొండలో ప్రయాణికుల దాహార్తి

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

ఎండలు మండుతున్న వేళ ప్రజల,ప్రయాణికుల దాహార్తి తీర్చడం కోసం రేగొండ మండల కేంద్రంలో పంచాయతీ ఆధ్వర్యంలో గ్రాండ్‌గా ప్రారంభించిన చలివేంద్రం ప్రస్తుతం నీరు లేక వెక్కిరిస్తోంది.స్థానిక సర్పంచ్,గ్రామ పాలకవర్గం ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం కేవలం ఒకటి రెండు రోజులకే పరిమితమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



**నీరు లేని కుండలు.. నిట్టూరుస్తున్న ప్రయాణికులు**

మండల కేంద్రంలోని బస్టాండ్, రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రంలో ప్రస్తుతం చుక్క నీరు కూడా లేకపోవడం గమనార్హం.కుండలను పరిశీలించగా అవి ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దాహంతో వచ్చే ప్రయాణికులు కుండలను చూసి నీరు ఉంటాయని ఆశగా వెళ్లడం, తీరా అవి ఖాళీగా ఉండటంతో నిరాశతో వెనుదిరగడం నిత్యకృత్యమైంది. మేజర్ గ్రామపంచాయతీ అయిన రేగొండలో ఇటువంటి దుస్థితి నెలకొనడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.




**పేరుకే చలివేంద్రం.. పట్టించుకోని పాలకవర్గం**

“ప్రారంభించినప్పుడు ఉన్న ఉత్సాహం తర్వాత నీటిని నింపడంలో కనిపించడం లేదు” అని పలువురు ప్రయాణికులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. కేవలం ఫోటోల కోసం,పబ్లిసిటీ కోసం తూతూ మంత్రంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి,ఆ తర్వాత గాలికొదిలేశారని ప్రజలు మండిపడుతున్నారు. కనీస నీటి సౌకర్యం కూడా లేని చోట చలివేంద్రం బోర్డు ఎందుకు ఉంచారని ప్రశ్నిస్తున్నారు.గ్రామ పాలకవర్గం ఇప్పటికైనా స్పందించి, ఎండల తీవ్రత దృష్ట్యా చలివేంద్రంలో నిత్యం తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని,ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని రేగొండ గ్రామస్తులు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఆలమూరులో కొబ్బరి పీచు ఫ్యాక్టరీ దగ్ధం..



**ఆలమూరు(తెలుగు గళం)మే :5 :** ఆలమూరు నుండి జొన్నాడ వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డుపై మంగళవారం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. శరవణ ఫైబర్స్ కొబ్బరి పీచు ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డిస్టిక్ ఫైర్ ఆఫీసర్ మార్టిన్ లూథర్ కింగ్ ఆధ్వర్యంలో మండపేట, కొత్తపేట ఫైర్ సిబ్బంది సకాలంలో మంటలార్పడంతో పెను ప్రమాదం తప్పింది.ఈ ఘటన స్థానికంగా భయాందోళన కలిగించింది. మంటలు చెలరేగిన సమయంలో రహదారి పైకి పొగలు భారీగా అలుముకోవడంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. మంటలను అదుపు చేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం చోటు చేసుకుందని ఫైర్ సిబ్బంది, యజమాని మురళీకృష్ణ తెలిపారు. సుమారు మూడు లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనాలు వేశారు. అయితే ఎండలు తీవ్ర స్థాయిలో ఉన్నాయని, ఈ నేపథ్యంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఫైర్ సిబ్బంది సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే తమకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ పి.శ్రీనివాస్,కొత్తపేట ఫైర్ ఆఫీసర్ పి.శ్రీనివాస్,మండపేట సీనియర్ లీడింగ్ ఫైర్ మాన్ ఎం.వెంకట్ రావు, ఎల్ఎఫ్ ఎల్. రామకృష్ణ, డిఓపి బి.సూర్య ప్రకాష్,ఫైర్ మాన్ ఎన్వివిఎస్ఎన్ రెడ్డి, మండపేట కొత్తపేట ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

# లక్నేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల టాపర్స్‌కు ఘన సన్మానం

- గ్రామ సర్పంచ్ ఐలోని రజిత అశోక్ వారికి ఆర్థిక సహాయం అందించారు
- మొదటి ర్యాంక్ వచ్చిన కత్తి అంజలి కి రూ.10016
- రెండవ ర్యాంక్ వచ్చిన పిండి రాంచరణ్ కి రూ.5016
- ముడవ ర్యాంక్ వచ్చిన షెక్ సమ్రీన్ రూ .3016



**తెలుగు గళం న్యూస్ నర్సంపేట / లక్నేపల్లి మే 5**

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామం లోని గవర్నమెంట్ పదోవ తరగతిలో విద్యార్థిని విద్యార్థులు వారి యొక్క ప్రతిభను కనబరిచినారూ గ్రామ సర్పంచ్ ఐలోని రజిత అశోక్ ఆధ్వర్యంలో ఈరోజు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పదోవ తరగతిలో విద్యార్థిని విద్యార్థులు వారి యొక్క ప్రతిభను కనబరిచినా ప్రథమ ర్యాంక్ కత్తి అంజలి -535/600 . ద్వితీయ ర్యాంక్ పిండి రాంచరణ్ -532/600 .తృతీయ ర్యాంక్ షెక్ సమ్రీన్ -476/600. ర్యాంకులను సాధించి గ్రామంలోని తోటి విద్యార్థిని విద్యార్థులందరికీ గవర్నమెంట్ స్కూల్స్ అంటే ప్రైవేట్ స్కూల్స్ ని మించిన విద్య ఇక్కడ బోధించబడుతుంది.అనే తెలియపరుస్తూ జిల్లా సెకండరీ పాఠశాలకి మరియు లక్నేపల్లి గ్రామానికి మంచి పేరు తీసుకురావడం చాలా సంతోషంగా ఉంది ఇలానే మన గ్రామంలో ఉన్న విద్యార్థిని విద్యార్థులు అందరూ వారి తల్లిదండ్రులు మన పిల్లల భవిష్యత్తు బాగుండేలా మన గ్రామం మన బడి అనే నినాదంతో గ్రామంలో పిల్లలందరూ బడి బాటలో భాగంగా ముందుందు విద్యార్థిని విద్యార్థులు అందరూ మన గ్రామ స్కూల్లో విద్యను అభ్యసించి మొదటి స్థానంలో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రథమ మరియు ద్వితీయ మరియు తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు లక్నేపల్లి గ్రామ పంచాయతీ తరపున ఐలోని







రజిత అశోక్ సన్మానించి వారికి నగదు బహుమతిగా ఫస్ట్ ర్యాంక్ వచ్చిన కత్తి అంజలి కి రూ.10016 రెండవ ర్యాంక్ వచ్చిన పిండి రాంచరణ్ కి రూ.5016 ముడవ ర్యాంక్ వచ్చిన షెక్ సమ్రీన్ రూ .3016 అందించడం జరిగింది. మన ఊరు మనబడినీ కాపాడుకుందాం మన పిల్లల భవిష్యత్తుని నిర్మించుకుందాం. లక్నేపల్లి గ్రామానికి నిజంగా గర్వకారణమైన జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి అందరి హృదయాలను ఆనందంతో నింపారు. సాధారణ కుటుంబాల్లో పుట్టి, పరిమిత అవకాశాల మధ్య కూడా పెద్ద పెద్ద కలలు కంటూ , కష్టపడి చదివి ఈ స్థాయికి చేరుకున్న మన పిల్లలు నిజమైన స్ఫూర్తి. వారి వెనుక నిలిచిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మరియు ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా వందనాలు మన పిల్లల భవిష్యత్తు కోసం ప్రైవేట్ స్కూల్స్‌పై మాత్రమే ఆధారపడాల్సిన అవసరం లేదు. మన ప్రభుత్వ పాఠశాల కూడా నాణ్యమైన విద్యను అందించే ఆలయం మనం నమ్మకం పెంచుకుని సహకారం అందిస్తే బడి మన పిల్లల భవిష్యత్తును వెలిగించే దీపంగా మారుతుంది. ప్రతి నెలలో కనీసం ఒకసారి అయినా తల్లిదండ్రులంతా కలిసి పిల్లల చదువు గురించి చర్చించాలి. వారి కలలు, లక్ష్యాలు తెలుసుకుని, వారికి తోడ్పాటు అందించాలి. ఒక చిన్న ప్రోత్సాహం కూడా ఒక పిల్లవాడి జీవితాన్ని మార్చగలదు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాదం రాజ్ కుమార్, వార్డ్ మెంబర్ పరచికపు సంతోష్, కత్తి కిరణ్, ఎండి రహీం, సూదుల మహేందర్, కత్తి రాజు పిండి రాజు, జెడ్పీఎస్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు మరియు అధ్యాపక బృందం కార్యక్రమానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# హిందువుల మనోభావాలను దెబ్బతీసిన సురేఖ రాజీనామా చేయాలి

## : గంట రవికుమార్

**తెలుగు గళం న్యూస్ వరంగల్ మే05**



హిందువుల ఆరాధ్యదైవమైన శ్రీరాముడుపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా అభ్యంతరకరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మండిపడ్డారు.మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో, మంత్రి వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు.మంత్రి సురేఖ బేషరతుగా హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే ఆమెను ఎక్కడికక్కడే అడ్డుకుంటామని హెచ్చరించారు. దేవాదాయ శాఖ బాధ్యతలో ఉండి హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. గతంలో ఒక మాజీ ఎమ్మెల్యే చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, ప్రజలు తగిన సమాధానం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.కాంగ్రెస్ పార్టీకి హిందువుల పట్ల గౌరవం లేదని, మంత్రి తన పదవిని కాపాడుకోవడానికే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు.రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు రావడం లేదన్న మంత్రి వ్యాఖ్యలపై స్పందించిన గంట రవికుమార్, ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేంద్రం అందించిన అభివృద్ధి నిధులను గుర్తు చేశారు.మామునూరు ఎయిర్‌పోర్టు, స్మార్ట్ సిటీ, హృదయ్ పథకం, గిరిజన యూనివర్సిటీ, రైల్వే ఫ్యాక్టరీ వంటి ప్రాజెక్టులు కేంద్రం సహకారంతోనే సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ హిందీలో మాట్లాడటం పై మంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనల్లో ఏ భాషలో మాట్లాడుతున్నారో గుర్తు చేసుకోవాలని అన్నారు. మంత్రి వ్యాఖ్యలు రాజకీయ ప్రయోజనాల కోసమేనని విమర్శించారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



**హనుమకొండ, మే 5 (తెలుగు గళం న్యూస్)**



వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య బుధవారం హనుమకొండలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రేటర్ వరంగల్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (జీడబ్ల్యూఎస్‌సీఎల్) ఆధ్వర్యంలో బల్దియా పరిధిలోని 29వ డివిజన్ భద్రకాళి బండ్ (పోతన రోడ్డు వైపు) వద్ద రూ.84.20 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు.అనంతరం నగరంలోని 3వ డివిజన్ పైడిపల్లి ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాన్ని డా. కడియం కావ్య ప్రారంభించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, గృహ సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ (పశ్చిమ) ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్/బల్దియా ఇంచార్జి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, జిల్లా కలెక్టర్ డా. సత్య శారద తదితరులు పాల్గొన్నారు.





# భార్యను చంపిన భర్త కిరణ్ అరెస్ట్



**కడపజిల్లా (బిఎన్ఎస్) మే05:**

ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్ రెడ్డి నగర్ లోభద్రిపల్లె పద్మను ఆమె భర్త బద్రిపల్లి కిరణ్ విషమిచ్చి చంపిన కేసులో భర్తను అరెస్టు చేసినట్లు అడిషనల్ ఎస్పీ విభూ కృష్ణ తెలుపుతూ ప్రొద్దుటూరు సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. నిందితుడి కిరణ్ భార్య లావుగా ఉందని,ఎక్కువ తిండి తింటుందని దానివల్ల చంపినట్లు పోలీసు విచారణలో చెప్పారన్నారు.. కిరణ్ కుఎనిమిదేళ్ల క్రితం వివాహమైందని భద్రిపల్లె కిరణ్ ముద్దనూరులోని వారి మామ ఇంటిలోనే ఉంటున్నాడని,ఏడు సంవత్సరాల కుమార్తె కూడా ఉందన్నారు.భార్యని ఎలాగైనా చంపాలని భావించిన భద్రిపల్లి కిరణ్ నెట్లో సెర్చ్ చేసి 80 వేలు విలువచేసే విషపదార్థాన్ని తెప్పించుకున్నారని తెలిపారు.భార్యను ప్రొద్దుటూరు మండలం ఈశ్వర్ రెడ్డి నగర్ లోని కిరణ్ తల్లిదండ్రుల ఇంటికి గత నెల 26వ తేదీన తీసుకొచ్చారన్నారు. విషాన్ని 29వ తేదీ రాత్రి భార్యకి విషమిచ్చి,ఆమె పడిపోయాక దిండు అదిమిపట్టి ఊపిరాడకుండాచేశారన్నారు.

అతనికేమీ తెలియనట్లు భార్య కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పారని వివరించారు.మృతురాలు తండ్రి ముద్దనూరు పట్టణానికి చెందిన బెంగుళూరు రాజకుల్లాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని, పోలీసులు తమదైన శైలిలోలోతైన విచారణ లో అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగానిందితున్ని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు అడిషనల్ ఎస్పీ విభూకృష్ణ తెలిపారు.ఈసమావేశంలో వన్ టౌన్ సిఐ కొండారెడ్డి, ఎస్సైలు మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణకు మారుపేరు ఫోర్మెన్ ఎడ్ల రాజేందర్



**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ మే05**

స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన విద్యుత్ శాఖ విశ్రాంత ఫోర్మెన్ ఎడ్ల రాజేందర్‌కు ఘన సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్పిడిసీఎల్ ఘనపూర్ డివిజన్ ఇంజనీర్ బి. సారయ్య హాజరై రాజేందర్‌ను క్రమశిక్షణకు ప్రతిరూపంగా కొనియాడారు.విద్యుత్ ఉద్యోగుల ఐఎన్టీయూసీ 327 యూనియన్ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సారయ్య మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ అనేది జీవితంలో ఒక సహజమైన దశ అని తెలిపారు. రాజేందర్ తన 34 ఏళ్ల సేవలో ఎప్పుడూ విధుల్లో అలసత్వం ప్రదర్శించకుండా క్రమశిక్షణతో పనిచేసారని, సమయపాలనలో ఆదర్శంగా నిలిచారని అన్నారు. ప్రతి ఉద్యోగి ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.మరో ముఖ్య అతిథి ఐఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెట్టిపల్లి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాజేందర్ చేసిన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం మేడే రోజున "శ్రామిక శక్తి అవార్డు"తో సత్కరించడం గర్వకారణమన్నారు. కార్మికులకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని, సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా 327 యూనియన్ కార్యవర్గం సమక్షంలో రాజేందర్ దంపతులను ఘనంగా సన్మానించి, ప్రత్యేక జ్ఞాపికతో పాటు రావలసిన పారితోషికాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఘనపూర్ ఏడీఈ పాల్వాయి రణధీర్ రెడ్డి, ఏఈ పి. శంకర్, స్వేత, సబ్ ఇంజనీర్ సాధన, హరిత, యూనియన్ జిల్లా



వర్కింగ్ ప్రెసిడెంట్ మూల మహేందర్, డివిజన్ నాయకులు ఓ. యాదగిరి, బి. రాజ్ కుమార్, ఎండి. ఫయాజ్, డి. సాంబరాజు, జి. సుధాకర్, కే. విజయ్ కుమార్, కే. నరోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భారీ రుణాలతో సంక్షేమం -- రాజ్యాంగబద్ధతపై చర్చ

**తెలుగు గళం న్యూస్ విశాఖపట్నం, మే 5**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ స్థాయిలో రుణాలు తీసుకుని సంక్షేమ పథకాలు అమలు చేయడం ఎంతవరకు సమంజసం అనే అంశం ప్రస్తుతం సమాజంలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత మూడు సంవత్సరాల్లో సుమారు ?76 వేల కోట్ల రుణాలు తీసుకుని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ప్రకటించడం ఆందోళనకు దారితీసింది.ఈ నేపథ్యంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ సీపాన గుణవతి మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ అప్పు విధానాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలు తీర్చడం ప్రభుత్వ బాధ్యత అయినప్పటికీ, అధిక రుణాలు తీసుకోవడం ద్వారా భవిష్యత్ తరాలపై భారాన్ని మోపడం సరికాదని అన్నారు."రాజ్యాంగం సంక్షేమానికి అవకాశం ఇస్తుంది. కానీ ఆర్థిక క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యం. అధిక అప్పులు తాత్కాలిక ప్రయోజనం కలిగించినా, దీర్ఘకాలంలో ఆర్థిక అసమతుల్యతకు దారి తీస్తాయి" అని ఆమె పేర్కొన్నారు.ప్రస్తుతం తీసుకుంటున్న రుణాల భారం రేపటి యువతపై పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తూ, ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం తీసుకున్న రుణాల వినియోగంపై పూర్తి పారదర్శకత ఉండాలని డిమాండ్ చేశారు.సంక్షేమం--ఆర్థిక స్థిరత్వం మధ్య సమతుల్యత సాధించడం ప్రభుత్వాల ముందు ఉన్న ప్రధాన సవాల్‌గా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఆటో డ్రైవర్ సాహసం..

## అభినందించిన సీపీ సజ్జనార్

హైదరాబాద్: ఓ ఆటో డ్రైవర్ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా చూపిన తెగువను హైదరాబాద్ సీపీ సజ్జనార్ మెచ్చుకున్నారు. మహిళ మెడలో నుంచి బంగారం గొలుసు లాక్కుని పరారయ్యేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్‌ను ఆటో డ్రైవర్ పట్టుకుని సాహసం ప్రదర్శించాడు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బేగంబజార్ జిన్సీ చౌరాహా ప్రాంతంలో ఓ మహిళ తన కోడలితో కలిసి మార్నింగ్ వాక్‌కు వెళ్లారు. డబీర్‌పురాకు చెందిన రౌడీషీటర్ మహ్మద్ సోహేల్.. ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఆ క్రమంలో దొంగ స్కూటీ అదుపుతప్పి కిందపడిపోయాడు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో అదే సమయంలో అటుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ జహీర్ గమనించారు. వెంటనే ఆటో వెనక్కి తిప్పి.. వాహనంపై నుంచి లేచి పరారయ్యేందుకు ప్రయత్నించిన రౌడీషీటర్‌ను తన ఆటోతో ఢీకొట్టాడు. నిందితుడు ఆటో డ్రైవర్‌పై కర్రతో దాడికి దిగాడు. అయినా లెక్క చేయకుండా ఆటో డ్రైవర్.. రౌడీషీటర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించాడు. సీసీ కెమెరాల్లో ఈ దృశ్యాలు నమోదయ్యాయి. సీపీ సజ్జనార్ ఆటో డ్రైవర్ జహీర్‌ను సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు.



# పనీర్ శరీరానికి మేలే చేస్తుంది.. కానీ ఈ పొరపాట్లను చేయవద్దు



**హెల్త్ న్యూస్, 05 మే (తెలుగు గళం):** శాకాహారంలో ప్రోటీన్ కోసం ఎక్కువ మంది ముందుగా గుర్తుకు తెచ్చుకునే ఆహారం పనీర్. కూరలు, స్నాక్స్, సలాడ్స్‌లో విరివిగా ఉపయోగించే ఇది పోషకాలతో నిండినదే. కానీ చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే పనీర్‌ను ఎలా వండుతాం, ఎలా నిల్వ చేస్తాం, ఎంత మోతాదులో తీసుకుంటాం అన్నదానిపై దాని ప్రోటీన్ లాభం ఆధారపడి ఉంటుంది. కొన్ని చిన్న పొరపాట్లు దీని పోషక విలువలను తగ్గిస్తాయి. అధిక మంటపై పనీర్‌ను ఎక్కువసేపు వండడం ఒక సాధారణ తప్పు. అధిక ఉష్ణోగ్రత వల్ల పాలలోని ప్రోటీన్ల నిర్మాణం మారుతుంది. దీని వల్ల ప్రోటీన్ పూర్తిగా నశించకపోయినా, శరీరం దాన్ని సులభంగా గ్రహించే విధానాన్ని ప్రభావితం చేస్తుంది. అందుకే పనీర్‌ను తక్కువ మంటపై సున్నితంగా వండడం మంచిది.

డీప్ ఫ్రై..

ఇక డీప్ ఫ్రై చేయడం కూడా మరో పెద్ద పొరపాటు. నూనెలో వేయించిన పనీర్ రుచిగా ఉన్నప్పటికీ, అది ఎక్కువ కొవ్వు, క్యాలరీలను చేరుస్తుంది. ఫలితంగా ప్రోటీన్-టు-కాలరీ నిష్పత్తి తగ్గుతుంది. అంటే ప్రోటీన్ లభించినా, అవసరానికి మించిన కొవ్వు శరీరంలో చేరుతుంది. అందుకే గ్రిల్ చేయడం, ఎయిర్ ఫ్రై చేయడం లేదా తక్కువ నూనెలో వేయించడం ఉత్తమ ఎంపికలు. మరొక ముఖ్యమైన విషయం పనీర్ నాణ్యత. మార్కెట్‌లో లభించే ప్యాకేజ్డ్ లేదా ప్రాసెస్ చేసిన పనీర్‌లో కొన్ని సందర్భాల్లో యాడిటివ్స్ ఉంటాయి, లేదా పాల ఘన పదార్థాలు తక్కువగా ఉంటాయి. అందువల్ల తాజాగా ఇంట్లో తయారుచేసిన పనీర్ లేదా నాణ్యమైన ఉత్పత్తులను ఎంపిక చేయడం మంచిది.

నిల్వ కూడా ముఖ్యమే..

పనీర్‌ను కేవలం మైదా లేదా రిఫైన్డ్ కార్బొహైడ్రేట్స్‌తో కలిపి తినడం కూడా ఒక పొరపాటు. ఇలాంటి ఆహారం త్వరగా ఆకలి పెరగడానికి కారణమవుతుంది. ఫలితంగా ప్రోటీన్ ఉపయోగం తగ్గుతుంది. పనీర్‌ను ఫైబర్ ఉన్న కూరగాయలు, గింజలు, సంపూర్ణ ధాన్యాలతో కలిపి తింటే శరీరానికి మరింత ప్రయోజనం ఉంటుంది. ఇక పనీర్ నిల్వ విధానం కూడా చాలా ముఖ్యం. సరైన విధంగా నిల్వ చేయకపోతే అది త్వరగా పాడైపోవడం మాత్రమే కాదు, పోషక విలువ కూడా తగ్గుతుంది. ఫ్రిజ్‌లో నీటిలో ఉంచి రెండు రోజుల్లోపు ఉపయోగించడం మంచిది. బయట ఎక్కువసేపు ఉంచడం లేదా ఉష్ణోగ్రత మార్పులకు గురిచేయడం మంచిది కాదు.

ఎంత మోతాదులో తీసుకోవాలి..

అంతేకాకుండా పనీర్ మోతాదు విషయంలో కూడా జాగ్రత్త అవసరం. సాధారణంగా 100-150 గ్రాముల పనీర్ తీసుకోవడం సరిపోతుంది. ఇందులో సుమారు 18-20 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది, ఇది శరీరానికి అవసరమైన ప్రోటీన్ వినియోగాన్ని తీరుస్తుంది. ఒకేసారి ఎక్కువగా తీసుకోవడం కంటే రోజంతా విభజించి తీసుకోవడం ఉత్తమం. పనీర్ ఒక మంచి ప్రోటీన్ వనరు అయినప్పటికీ, దాన్ని ఎలా వాడుతున్నామన్నదే ముఖ్యమైనది. చిన్నచిన్న అలవాట్లను సరిచేసుకుంటే పనీర్ ద్వారా పూర్తి పోషక లాభాలను పొందవచ్చు. ఆరోగ్యకరమైన వంట విధానాలు, సరైన మోతాదు, మంచి నిల్వ పద్ధతులను పాటిస్తే పనీర్ నిజంగా డైట్‌లో ఉత్తమ ఆహారంగా మారుతుందని పోషకాహార నిపుణులు తెలియజేస్తున్నారు.

# బుమ్రా కెరీర్‌లోనే వరస్ట్ ఐపీఎల్ సీజన్.. ఆ మ్యాజిక్ ఏమైంది?



**స్పోర్ట్స్ న్యూస్, 05 మే (తెలుగు గళం):** : భాతర క్రికెట్ జట్టులో కీలక బౌలర్ అయిన జస్ప్రీత్ బుమ్రా.. ఐపీఎల్ 2026 లో అత్యంత పేలవంగా ప్రదర్శన కనబరుస్తున్నాడు. ప్రపంచ కప్ లో టాప్ బౌలర్ గా నిలిచిన అతను ఐపీఎల్ లో యువ బ్యాటర్ల ధాటికి తట్టుకోలేక భారీగా పరుగులు సమర్పిస్తున్నాడు. ముఖ్యంగా 7 మ్యాచుల తర్వత మొదటి వికెట్ ఖాతాలో పడిందంటే ఈ సీజన్ లో అతను ఫామ్ ఎలా ఉందో అర్థమవుతుంది. దీంతో ముంబై ఇండియన్స్ స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు ఐపీఎల్ 2026 సీజన్ ఒక పీడకలగా మిగిలిపోయింది. గత దశాబ్ద కాలంగా ప్రపంచ అత్యుత్తమ బౌలర్లలో ఒకరిగా కొనసాగుతున్న బుమ్రా, ఈ సీజన్‌లో తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయారు. సాధారణంగా పొదుపుగా బౌలింగ్ చేస్తూ వికెట్లు తీసే బుమ్రా, ఈసారి భారీగా పరుగులివ్వడమే కాకుండా కీలక సమయాల్లో వికెట్లు తీయడంలోనూ విఫలమయ్యారు. ఆయన కెరీర్‌లోనే అత్యధిక ఎకానమీ రేటు నమోదైన సీజన్‌గా ఇది నిలిచింది.

బుమ్రా వైఫల్యానికి ప్రధానంగా డెత్ ఓవర్లలో ఆయన వేసే యార్కర్లు కచ్చితత్వంతో పడకపోవడమే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. అలాగే ముంబై ఇండియన్స్ ఇతర బౌలర్లు అవతలి వైపు నుంచి ఒత్తిడి తీసుకురాకపోవడంతో, బ్యాటర్లు బుమ్రాపై లక్ష్యంగా చేసుకుని విరుచుకుపడ్డారు. గాయాల నుంచి కోలుకుని వచ్చిన తర్వాత ఆయన మునుపటి వేగాన్ని అందుకోలేకపోవడం కూడా టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఆందోళనకు గురిచేస్తోంది. ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ రేసు నుంచి త్వరగా నిష్క్రమించడానికి బుమ్రా ఫామ్‌లో లేకపోవడం కూడా ఒక ప్రధాన కారణంగా తెలుస్తుంది. ఏది ఏమైనప్పటికి ప్రపంచ అత్యుత్తమ బౌలర్ బుమ్రా ఇలా భారీగా పరుగులు ఇవ్వడం అతని కెరీర్ పై ప్రభావం చూపుతుందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.

# దు:ఖంలో సీఎస్కే ఫ్యాన్స్.. ఐపీఎల్ 2026 నుంచి ధోనీ అవుట్!



**స్పోర్ట్స్ న్యూస్, 05 మే (తెలుగు గళం):** ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్, చెన్నై సూపర్ కింగ్స్ దిగ్గజం ఎంఎస్ ధోని ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. పిక్క గాయం కారణంగా ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడని ధోని, తాజాగా మంగళవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన కీలక పోరుకు కూడా అందుబాటులో లేకపోవడంతో అభిమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత మ్యాచ్‌ల వరకు ధోని మైదానానికి రాకపోయినా జట్టుతో పాటే ఉన్నాడు. అయితే ఢిల్లీతో మ్యాచ్ కోసం సీఎస్కే జట్టు ఢిల్లీకి పయనమవగా, ధోని వారితో కలిసి వెళ్లలేదని సమాచారం. ఈ విషయాన్ని సీఎస్కే బౌలింగ్ సలహాదారు ఎరిక్ సిమన్స్ స్వయంగా ధృవీకరించారు. "ధోని ప్రస్తుతం మాతో లేడు. ఆయన ఇంకా గాయం నుంచి కోలుకుంటున్నారు" అని సిమన్స్ పేర్కొన్నారు.

ముగిసిన శకం?

జట్టుతో పాటు ధోని ప్రయాణించకపోవడంతో ఆయన ఈ సీజన్ నుంచి పూర్తిగా తప్పుకున్నట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. 44 ఏళ్ల వయసులో గాయం తిరగబెట్టడం, మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించలేకపోవడంతో ఇదే ఆయనకు చివరి ఐపీఎల్ అయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. మైదానంలోకి దిగకుండానే ధోని రిటైర్మెంట్ ప్రకటించవచ్చని వస్తున్న ఊహాగానాలు సీఎస్కే అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయి. ఇదే సమయంలో ధోని సేవలు అందుబాటులో లేకపోవడం చెన్నై జట్టు ప్రదర్శనపై కూడా ప్రభావం చూపుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు జరిగిన 9 మ్యాచ్‌ల్లో కేవలం 04 మ్యాచ్‌లు గెలిచి, 05 మ్యాచ్‌లు ఓడిపోయింది. ప్రస్తుతం ఈ జట్టు పాయింట్ల పట్టికలో 6వ స్థానంలో కొనసాగుతుంది. చెన్నై ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే మిగిలిన మ్యాచ్‌లు అత్యంత కీలకం. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ధోని గైర్హాజరు జట్టుకు పెద్ద లోటుగా మారింది. మరి ధోనీ ఈ సీజన్ చివరలోనైనా మైదానంలో కనిపిస్తాడా లేక ఇలాగే వీడ్కోలు పలుకుతాడా అనేది వేచి చూడాలి.

# అదరగొట్టిన సంజు శాంసన్.. ఢిల్లీపై చెన్నై విజయం



**స్పోర్ట్స్ న్యూస్, 05 మే (తెలుగు గళం):** ఐపీఎల్ 2026లో భాగంగా అరుణ్‌జైట్లీ స్టేడియం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టపోయి 155 పరుగులు చేసింది. అనంతరం ఛేదనకు దిగిన చెన్నై 17.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. చెన్నై బ్యాటర్లలో సంజు శాంసన్ (87*; 52 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్స్‌లు) అద్భుతంగా రాణించాడు. కార్తిక్ శర్మ 41* (31 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) పరుగులు చేశాడు. రుతురాజ్ గైక్వాడ్ (6), ఉర్విల్ పటేల్ (17) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్, లుంగి ఎంగిడి తలో వికెట్ తీసుకున్నారు.

అంతకుముందు ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్‌లో సమీర్ రిజ్వీ (40*; 24 బంతుల్లో 4 సిక్స్‌లు) టాప్ స్కోరర్. ట్రిస్టన్ స్టబ్స్ (38; 31 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించాడు. పాథుమ్ నిశాంక (19), కేఎల్ రాహుల్ (12), నితీశ్ రాణా (15), కరుణ్ నాయర్ (13), అక్షర్ పటేల్ (2), అశుతోశ్ శర్మ (14) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. చెన్నై సూపర్ కింగ్స్ బౌలర్లలో నూర్ అహ్మద్ రెండు, అకేల్ హొసేన్, ముకేశ్ చౌదరి, గురుజప్నీత్ సింగ్, జెమీ ఓవర్టన్ తలో వికెట్ తీసుకున్నారు.

# బెంగాల్ ఎన్నికల్లో భారీ విజయం సాధించిన భారత మాజీ క్రికెటర్ అశోక్ డిండా



**స్పోర్ట్స్ న్యూస్, 05 మే (తెలుగు గళం):** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భారత మాజీ ఫాస్ట్ బౌలర్ అశోక్ డిండా అద్భుత విజయాన్ని అందుకున్నారు. తూర్పు మేదినీపూర్ జిల్లాలోని మోయినా నియోజకవర్గం నుండి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన, తన సమీప ప్రత్యర్థి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అభ్యర్థి చందన్ మొండల్‌పై భారీ మెజారిటీతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో డిండాకు మొత్తం 1,27,166 ఓట్లు లభించగా, చందన్ మొండల్‌కు 1,10,925 ఓట్లు వచ్చాయి. తద్వారా ఆయన సుమారు 16,241 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు.

గతంలో 2021 ఎన్నికల్లో కేవలం 1,260 ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలిచిన డిండా, ఈసారి ఆ ఆధిక్యాన్ని గణనీయంగా పెంచుకోవడం విశేషం. టీమిండియా తరపున ఆడి తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న ఆయన, రాజకీయాల్లోనూ అదే తరహాలో రాణిస్తున్నారు. క్రికెట్ మైదానంలో తన వేగంతో ప్రత్యర్థులను కట్టడి చేసిన ఈ మాజీ పేసర్, ఇప్పుడు ఎన్నికల బరిలోనూ తనదైన ముద్ర వేశారు. పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించిన వేళ, డిండా విజయం ఆ పార్టీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపింది.

# ఓటీటీలోకి రాబోతున్న ‘పాపం ప్రతాప్’

టాలీవుడ్‌లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ప్రయాణాన్ని మొదలుపెట్టి, ఇప్పుడు హీరోగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటుడు తిరువీర్. వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తున్న ఆయన, తాజాగా నటించిన విలేజ్ డ్రామా ‘పాపం ప్రతాప్’. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా కమర్షియల్‌గా పెద్ద విజయం సాధించకపోయినప్పటికీ, చూసిన ప్రతి ఒక్కరినీ భావోద్వేగానికి గురిచేసింది. ముఖ్యంగా కొన్ని సన్నివేశాలు సినీ ప్రియుల కళ్లలో నీళ్లు తెప్పించాయని సోషల్ మీడియాలో టాక్ నడిచింది.దర్శకుడు ఎస్.సి. దుర్గా నగేష్ తెరకెక్కించిన ఈ చిత్రం పక్కా గ్రామీణ నేపథ్యంలో సాగుతుంది. తిరువీర్‌కు జంటగా పాయల్ రాధాకృష్ణ నటించగా, వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ, నటన సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. మిత్రవింద సినిమాస్ నిర్మించిన ఈ చిత్రానికి కె.ఎమ్. రాధాకృష్ణన్ అందించిన సంగీతం కథలోని ఫీల్‌ను మరింత ఎలివేట్ చేసింది. ఏప్రిల్ 17న థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా, విమర్శకుల ప్రశంసలు అందుకున్నప్పటికీ కలెక్షన్ల పరంగా ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. థియేటర్లలో ఈ చిత్రాన్ని మిస్ అయిన వారి కోసం ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్ అప్‌డేట్ వచ్చేసింది. ‘పాపం ప్రతాప్’ డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ ‘ఈటీవీ విన్’ సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమా మే 7 నుంచి స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రాబోతోంది. గ్రామీణ నేపథ్యం ఉన్న ఎమోషనల్ కథలను ఇష్టపడే వారికి ఈ సినిమా ఒక మంచి ఆప్షన్ అని చెప్పొచ్చు. తిరువీర్ నటనలోని సహజత్వం, భావోద్వేగపూరితమైన సన్నివేశాలు ఈ సినిమాను ఓటీటీలో చూసే ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటాయని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరి థియేటర్లలో మిస్ అయిన ఈ హార్ట్ టచింగ్ విలేజ్ డ్రామాను మీ ఇంట్లోనే కూర్చుని మే 7 నుంచి చూసి ఎంజాయ్ చేయండి.

# నా మీద కుట్రలు జరిగాయి




ప్రముఖ దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్, తనదైన శైలిలో ప్రేమకథలను, యాక్షన్ చిత్రాలను తెరకెక్కించి సినీ ఇండస్ట్రీలో ఒక ప్రత్యేక ముద్ర వేశారు. ప్రస్తుతం ఆయన నటుడిగా కూడా వరుస విజయాలు అందుకుంటున్నారు. ఇటీవల ఆయన నటించిన ‘యుఫోరియా’ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ సాధించడంతో నటుడిగా ఆయన రేంజ్ పెరిగింది. అయితే, దర్శకుడిగా మాత్రం గౌతమ్ మీనన్ గత కొన్నేళ్లుగా తీవ్ర గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా విక్రమ్ హీరోగా ఆయన తెరకెక్కించిన ‘ధృవ నక్షత్రం’ విడుదల కాకపోవడం ఆయన కెరీర్‌పై పెద్ద ప్రభావం చూపింది. 2017లో ప్రారంభమైన ‘ధృవ నక్షత్రం’ చిత్రం ఆర్థిక సమస్యల కారణంగా ఇన్నేళ్లుగా విడుదల నోచుకోలేదు. ఈ వివాదం చివరకు కోర్టుకు చేరింది. అయితే, ఎట్టకేలకు గత వారం ఈ కేసులో గౌతమ్ మీనన్‌కు అనుకూలంగా తీర్పు వచ్చింది. కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, ఈ చిత్రాన్ని దాదాపు 9 ఏళ్ల నిరీక్షణ తర్వాత మే 27న విడుదల చేయడానికి ముహూర్తం ఖరారు చేశారు. ఈ క్రమంలో జరిగిన ప్రమోషన్లలో గౌతమ్ మీనన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. చాలా ఎమోషనల్ అవుతూ గౌతమ్ మీనన్ ఇలా అన్నారు: “చాలామంది ఈ సినిమా విడుదలను అడ్డుకోవాలని కుట్రలు పన్నారు. కేవలం సినిమాను మాత్రమే కాదు, నా ఎదుగుదలను ఓర్వలేక నా కెరీర్‌ను కూడా నాశనం చేయాలని చూశారు. కానీ న్యాయస్థానం నాకు అండగా నిలిచింది. ఈ చారిత్రాత్మక తీర్పు భవిష్యత్తులో ఎంతోమంది ఫిలిం మేకర్స్‌కు ధైర్యాన్నిస్తుంది.” అని అన్నారు. ఇక తనపై కుట్ర పన్నిన వారికి హెచ్చరిక జారీ చేస్తూ, “నన్ను ఆపడం మీ తరం కాదు” అని ఆయన కుండబద్దలు కొట్టారు. గౌతమ్ మీనన్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక సున్నితమైన మనస్తత్వం ఉన్న దర్శకుడు ఇంత తీవ్రంగా స్పందించడంతో, అసలు ఆయన కెరీర్‌ను నాశనం చేయాలని చూసింది ఎవరు? ఆయనతో వివాదం ఉన్న ఆ వ్యక్తులు ఎవరు? అనే చర్చ మొదలైంది. సినిమా ఇండస్ట్రీలో ఆయన ఎదుగుదలను అడ్డుకోవాల్సిన అవసరం ఎవరికి ఉందంటూ అభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. గౌతమ్ మీనన్ ‘ధృవ నక్షత్రం’తో మళ్ళీ ఫామ్‌లోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది.

# విశ్వంభర నుండి కీరవాణి ఔట్




మల్లిడి వశిష్ట దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా రూపొందుతున్న భారీ చిత్రం ‘విశ్వంభర’. యూవీ క్రియేషన్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమా ఎప్పుడో రిలీజ్ కావాల్సి ఉండగా విఎఫెక్స్ కారణంగా సంవత్సరాల తరబడి వాయిదా పడుతూ వస్తోంది. ఈ సినిమాకు సంబంధించి ఓ న్యూస్ టాలీవుడ్ సర్కిల్స్ లో హాట్ టాపిక్ గా మారింది. ఈ సినిమాకు ఇప్పటివరకు ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. అయితే తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రానికి బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించే బాధ్యతను మరో సంగీత దర్శకుడు హరి గౌరకు అప్పగించినట్లు తెలుస్తోంది.

ఈ చిత్రంలో పాటలకు ఎం.ఎం. కీరవాణి మ్యూజిక్ అందించగా నేపథ్య సంగీతం విషయంలో మరింత కొత్తదనం కోసం ఆ బాధ్యతను హరి గౌరకు అప్పగించింది. ఇప్పటికే హరి గౌర ‘విశ్వంభర’ చిత్రానికి సంబంధించిన ఆర్.ఆర్ పనులను కూడా ప్రారంభించినట్లు సమాచారం సంగీత దర్శకుడు హరి గౌర ఇప్పటికే ‘హనుమాన్’ వంటి బ్లాక్ బస్టర్ చిత్రానికి అద్భుతమైన నేపథ్య సంగీతాన్ని అందించి అందరి దృష్టిని ఆకర్షించారు. అలాగే ‘మిరాయ్’ కూడా మంచి మ్యూజిక్ ఇచ్చాడు. ‘విశ్వంభర’ వంటి సోషియో ఫాంటసీ చిత్రానికి తనదైన శైలిలో పవర్‌ఫుల్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తారని మెగా అభిమానులు ఆశిస్తున్నారు. వాస్తవంగా సోషియో ఫాంటసీ సినిమాలకు సంగీతం అందించడంలో కీరవాణికి మంచి అనుభవం ఉంది. కానీ విశ్వంభర మేకర్స్ గౌరహరిని రంగంలోకి దింపుతున్నారు. అయితే రాజమౌళి తెరకెక్కిస్తున్న వారణాసి మ్యూజిక్ పనుల్లో కీరవాణి బిజిగా ఉండడం వలన విశ్వంభర బాక్గ్రౌండ్ కోసం గౌర హరిని తీసుకున్నారనే టాక్ కూడా వినిపిస్తోంది.






# రోడ్డు ప్రమాదంలో ప్రముఖ నిర్మాత దుర్మరణం..!



దక్షిణాది సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ నిర్మాత, నటుడు జీవా తండ్రి ఆర్‌బీ చౌదరీ దుర్మరణం చెందారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన ప్రయాణిస్తున్న కారు డివైడర్‌ను బలంగా ఢీకొట్టిన ఘటనలో ఆర్‌బీ చౌదరీ మృతి చెందారు. అక్కడ ఒక పెళ్లికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్టు సమాచారం.

దక్షిణాది చిత్రసీమలో సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై పలు చిత్రాలను నిర్మించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆర్‌బీ చౌదరీ మరణవార్తతో సినీలోకం విషాదంలో మునిగిపోయింది. చౌదరీ అంత్యక్రియలు చెన్నైలో జరుగనున్నాయి. ఆయనకు భార్య మహ్జబీన్‌తో పాటు, జీవా, రమేశ్, అశోక్.. ముగ్గురు కుమారులున్నారు.

సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ‘నట్టమయి’, ‘థుల్లథా మనముమ్ థుల్లుమ్’, ‘సూర్యవంశం’ వంటి బ్లాక్ బస్టర్ సినిమాలు అందించిన ఆయన.. ఫాహద్ ఫాజిల్, వడివేలుతో 98వ చిత్రంగా ‘మారీసన్’ రూపొందించారు. నటుడు విశాల్ దర్శకత్వంలో మగుదమ్ అనే సినిమాను నిర్మించారు కూడా. కానీ, ఇంతలోనే ఆర్‌బీ చౌదరీని రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడింది. సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఎన్నో విజయవంతమైన చిత్రాలను నిర్మించిన ఆయన మరనం పట్ల సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. తెలుగులో రాజా, నిన్నే ప్రేమిస్తా, సంక్రాంతి, నువ్వు వస్తావని, సుస్వాగతం, శివరామరాజు, రచ్చ, వంటి చిత్రాలను ఆర్‌బీ చౌదరీ నిర్మించారు.

# ‘ఫౌజీ’ షూటింగ్‌లో విషాదం

రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న తాజా చిత్రం ‘ఫౌజీ’ షూటింగ్‌లో విషాదం చోటుచేసుకుంది. సినిమా షూటింగ్ వెళ్తున్న యూనిట్ సభ్యుల కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట వద్ద జరిగిన ఈ దుర్ఘటనలో ఒకరు మృతిచెందగా.. ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న ఈ పీరియాడిక్ వార్ డ్రామా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుగుతోంది. ఇవాళ ఉదయం స్టాఫ్ షూటింగ్ వెళ్తుండగా.. తూప్రాన్‌పేట్ వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి చేర్చారు.

**యూనిట్‌లో విషాద ఛాయలు..**

సినిమా షూటింగ్ ఉత్సాహంగా జరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం జరగడంతో ‘ఫౌజీ’ చిత్ర యూనిట్ తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. మృతుడి కుటుంబ సభ్యులకు చిత్ర బృందం ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసింది. ప్రస్తుతం పోలీసులు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.